www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -170 మంగళవారం 6 అక్టోబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# కాళేశ్వరం మరమ్మతులు త్వరగా చేపట్టండి



**బ్యారేజీల ఎగువ, దిగువ భాగాల్లో డయాఫ్రం వాల్‌లు నిర్మించాలి**

**ఏదుల రిజర్వాయర్ నుంచే డిండి ఎత్తిపోతల పథకానికి జలాలు**

**నీటిపారుదల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం**

**హైదరాబాద్, అక్టోబరు 5(ప్రజావినికిడి):**
కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను నిర్ణీత వ్యవధిలోగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి నీటిపారుదలశాఖపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం బ్యారేజీల పునాదుల కింద భారీగా ఇసుక మైనింగ్ జరిగిందని, నిర్మాణ సమయంలో డిజైన్‌కు విరుద్ధంగా సీకెంట్ పైల్స్‌ను వినియోగించారని, వీటి అమరిక సరిగ్గా లేనందువల్ల బ్యారేజీల పునాదులు దెబ్బతిన్నాయని అధికారులు సీఎంకు నివేదించారు. మూడు బ్యారేజీలను పునరుద్ధరించి, మళ్లీ వినియోగంలోకి తేవాలంటే విధిగా బ్యారేజీల ఎగువ (అప్‌స్ట్రీమ్), దిగువ (డౌన్ స్ట్రీమ్)లలో డయాఫ్రం వాల్ కట్టాల్సి ఉంటుందని తెలిపారు. దాంతో పాటు బ్యారేజీల గేట్ల నుంచి విడుదలయ్యే వరద ప్రవాహ ఉధృతిని తట్టుకోవడానికి వీలుగా నీళ్లు పడే ప్రదేశం (స్టిల్లింగ్ బేసిన్)ను కూడా విస్తరించాల్సి ఉంటుందని వివరించారు. 2019లో బ్యారేజీల నిర్మాణం పూర్తి కాగా... ఆ తర్వాత ఏటా వరదలకు గేట్లు ఎత్తినప్పుడు డౌన్‌స్ట్రీమ్‌లోని రక్షణ వ్యవస్థలన్నీ దెబ్బతింటున్నాయని, టెయిల్‌పాండ్ ఉంటే బ్యారేజీల గేట్ల నుంచి వరదలోని శక్తిని నిర్వీర్యం చేసే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. అధికారుల వివరణ విన్న సీఎం.. బ్యారేజీల మరమ్మతుల డిజైన్‌లకు తుదిరూపు ఇచ్చి... కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)లోని ఓవర్ సైట్ కమిటీ మధింపు అనంతరం పనులు ప్రారంభించాలని ఆదేశించారు. బ్యారేజీల ఎగువ, దిగువ భాగంలో డయాఫ్రం వాల్‌లు నిర్మించాలని,మిగతాది 2లో...

# కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు



**సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం విచారణ**

**కేంద్ర ప్రభుత్వం, ఈసీకి వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులు**

**ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాల్లో సీఈసీ ఒంటరిగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణ**

**చట్టవిరుద్ధమైన నిర్ణయాలు ఉంటే రద్దు చేస్తామన్న సుప్రీంకోర్టు ధర్మాసనం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 5,(ప్రజావినికిడి):**
ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అధికారాల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది. ఇతర కమిషనర్లతో సంప్రదించకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లను స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. మిగతాది 2లో...

# కలిసి పనిచేస్తాం

**భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది -స్విస్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్**

**100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు -ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 5(ప్రజావినికిడి):**
అంతర్జాతీయ దౌత్య రంగంలో భారత్ అత్యంత కీలకమైన శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్ ప్రశంసించారు. గ్లోబల్ గవర్నెన్స్, సాంకేతిక రంగాలలో కూడా న్యూదిల్లీ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు 3 రోజుల అధికారిక పర్యటన నిమిత్తం దిల్లీ విచ్చేసిన ఆయన, ప్రధాని మోదీతోమిగతాది 2లో...



# ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారు

**మార్చారనేది నిస్సందేహంగా రుజువైంది**

**నిబంధనలకు విరుద్ధంగా సీఈసీ నిర్ణయాలు**

**సిఈసి జ్ఞానేష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలి**

**ఫారమ్-6 మార్పులపై రాహుల్ తీవ్ర విమర్శలు**




**న్యూఢిల్లీ, అక్టోబర్ 5,(ప్రజావినికిడి):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో ఫారమ్-6 మార్పులను తాము ఆమోదించలేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసిన వేళ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు.మిగతాది 2లో...

# మెదడు రహస్యాలను ఛేదించిన ఆప్టోజెనెటిక్స్

**వైద్యశాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ముగ్గురికి సంయుక్తంగా ప్రకటన**

**కార్ల్ డీస్సెరొత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాజెల్‌లను వరించిన పురస్కారం**

**ఆప్టోజెనెటిక్స్ అనే టెక్నిక్‌ను అభివృద్ధి చేసినందుకు ఈ గౌరవం**

**కాంతిని ఉపయోగించి మెదడులోని నరాల కణాలను నియంత్రించడం దీని ప్రత్యేకత**

**జ్ఞాపకాలు, భావోద్వేగాలను అర్థం చేసుకోవడంలో ఈ ఆవిష్కరణ ఒక మైలురాయి**



2లో.

# సుప్రీంకోర్టు జడ్జిగా తెలంగాణ హైకోర్టు సీజే

**పదోన్నతి పొందిన జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్.. సుప్రీం న్యాయమూర్తులుగా మరో ఇద్దరి నియామకం**



2లో.

# ఒక్కో ఉద్యోగికీ రూ.1,10,250 బోనస్.

**సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి బొనాంజా**

**బోనస్ పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక ప్రకటన**

**హైదరాబాద్, అక్టోబర్ 05 (ప్రజావినికిడి):**
దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సింగరేణి కార్మికులకు కేంద్రం బోనస్?ను ప్రకటించింది. ఈ మేరకు ఒక్కో ఉద్యోగికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్రమంత్రి కిషన్? రెడ్డి తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, సింగరేణి భవిష్యత్తు కోసం యాజమాన్యం, కార్మికులు మరింత సమన్వయంతో పనిచేయాలని కోరారు.మిగతాది 2లో...



# రేవంత్ సర్కార్ కుట్రలు

**వారసత్వ కట్టడాలను కూల్చేసే పన్నాగం**

**బొగ్గు గని ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి**

**లేకుంటే పెద్ద ఎత్తున మేం ఉద్యమిస్తాం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్, (ప్రజావినికిడి):** ఒవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్రంలో భూములు దోచుకోవడం అయిపోయింది. ఇక భూముల లోపల ఉన్న సంపద దోచుకొని, వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్ సర్కార్ కుట్రలు పన్నుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ మేరకు ఎక్స్ లో మిగతాది 2లో...

# ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు..

**ప్రత్యేక పాలసీకి తెలంగాణ ప్లాన్**

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు**

**అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచన**

**'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్ష**

**హైదరాబాద్, అక్టోబర్ 5(ప్రజావినికిడి):**
తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌తో మిగతాది 2లో...



# ఏసీబీ వలలో డీఎంహెచ్ఓ

**రూ.2 లక్షల డిమాండ్..**

**రూ.లక్ష తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లాడీఎంహెచ్ఓ సహా ముగ్గురు అరెస్ట్**



2లో.

ప్రజా వినికిడి
మా అక్షరం-మా ఆయుధం
తెలుగు దినపత్రిక



# మెదడు రహస్యాలను ఛేదించిన ఆప్టోజెనెటిక్స్

**వైద్యశాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ముగ్గురికి సంయుక్తంగా ప్రకటన**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 5(ప్రజావినికిడి):** ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరొత్ (స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. 'కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్'పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది.మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. కానీ, అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తుపటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. "ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది" అని నోబెల్ కమిటీ ఛైర్మన్ పెర్ స్వెన్నింగ్‌సన్ వ్యాఖ్యానించారు.

ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. 'క్లామిడోమోనాస్' అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్‌తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై 'ఛానెల్‌రోడోప్సిన్' అనే ఒక ప్రత్యేకమైన ప్రొటీన్‌ను కనుగొన్నారు. దీనిపై నీలి రంగు కాంతి పడినప్పుడు, ఆ ప్రొటీన్‌లో ఒక మార్గం (ఛానెల్) తెరుచుకుని, అయాన్లు కణం లోపలికి ప్రవహించి ఒక విద్యుత్ సంకేతాన్ని సృష్టిస్తాయని వారు గుర్తించారు. ఈ ప్రొటీన్‌ను ఏ కణంలో ప్రవేశపెట్టినా, ఆ కణం కాంతికి స్పందించేలా మారుతుందని నిరూపించారు. ఈ పరిశోధనను కార్ల్ డీస్సెరొత్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఛానెల్‌రోడోప్సిన్ జన్యువును ఎలుకల మెదడులోని నరాల కణాలలోకి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిపై నీలి కాంతిని ప్రసరింపజేసి, నరాల సంకేతాలను విజయవంతంగా ప్రేరేపించగలిగారు. 2005లో ఆయన ఈ ప్రయోగాన్ని ప్రచురించగా, రెండేళ్ల తర్వాత 2007లో బతికున్న ఎలుకల మెదడులో ఈ 'కాంతి ఆధారిత స్విచ్' పనిచేసేలా చేసి సంచలనం సృష్టించారు.

ప్రస్తుతం 'ఆప్టోజెనెటిక్స్' అని పిలుస్తున్న ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందింది. దీనిని ఉపయోగించి పరిశోధకులు నిర్దిష్ట జ్ఞాపకాలు, భయం, ఆనందం వంటి భావోద్వేగాలు, ప్రవర్తనలను నియంత్రించే నాడీ వలయాలను (న్యూరల్ సర్క్యూట్స్) ఛేదిస్తున్నారు. ఇది మానసిక, నాడీ సంబంధిత వ్యాధులపై మన అవగాహనను పెంచుతోంది. వైద్య రంగంలో, దృష్టి లోపం ఉన్నవారికి తిరిగి చూపును అందించే ప్రయత్నాలలో ఈ పద్ధతిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణ మన మెదడుపై ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. ఈ సాంకేతికత సాయంతో ప్రతిరోజూ కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తూ, మానవాళి ముందున్న అతిపెద్ద రహస్యాలలో ఒకటైన మన మెదడు పనితీరును అర్థం చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తున్నాయి.

# కాళేశ్వరం మరమ్మతులు త్వరగా చేపట్టండి

(మొదటి పేజి తరువాయి)

స్టిల్లింగ్ బేసిన్‌ను కూడా పెంచాలని సూచించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)పై కూడా సమావేశంలో చర్చ జరిగింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీలపై సీడబ్ల్యూసీ అధికారులతో సమావేశం అనంతరం.. వారు కోరిన కీలక వివరాలన్నీ సీడబ్ల్యూసీకి, మహారాష్ట్ర అధికారులకు పంపించినట్లు అధికారులు తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ఏదుల రిజర్వాయర్ నుంచే డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలించడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఈ పథకం డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించినప్పుడే ఈ విషయాన్ని పొందుపరచడం జరిగిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి పథకం పరిధిలో అవసరాలు తీర్చుతూనే డిండికినీటిని తరలించాలని ఆదేశించారు. డిండిలో కెనాల్, ఇతర కాంపోనెంట్లు కొలిక్కి వచ్చినప్పటికీ హెడ్ రెగ్యులేటరీ విషయంలో సందిగ్ధత ఉందని అధికారులు చెప్పగా.. ఏదుల నుంచే డిండికి నీటిని తరలించాలని సీఎం స్పష్టం చేశారు.

# ఏసీబీ వలలో డీఎంహెచ్ఓ

**రూ.2 లక్షల డిమాండ్..**

**రూ.లక్ష తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లాడీఎంహెచ్ఓ సహా ముగ్గురు అరెస్ట్**




**రాజేంద్రనగర్ (ప్రజావినికిడి): అక్టోబర్ 5:**అవినీతిపై ఏసీబీ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ కొందరు ప్రభుత్వ అధికారులు లంచాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్య శాఖలో సోమవారం జరిగిన ఏసీబీ దాడి కలకలం రేపింది. ఫిజియోథెరపీ సెంటర్‌కు లైసెన్స్ కోసం రూ.లక్ష లంచం.. ముగ్గురు ఏసీబీకి చిక్కిన వైనం రంగారెడ్డి: ఫిజియోథెరపీ సెంటర్‌కు సంబంధించిన వ్యవహారంలో రూ.లక్ష లంచం తీసుకున్న కేసులో రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయానికి చెందిన ఇద్దరు అధికారులతో పాటు ఓ ప్రైవేట్ డ్రైవర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి, డీఎంహెచ్ఓ కార్యాలయ హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాస్ సూచనల మేరకు వారి వద్ద ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మద్దూరి కృష్ణయ్య ఫిర్యాదుదారుడిని రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశాడు.చివరకు రూ.లక్ష తీసుకునేందుకు అంగీకరించాడు. సీజ్ చేసిన ఫిజియోథెరపీ సెంటర్ తాళాలను తిరిగి ఇవ్వడం, డీఎంహెచ్ఓ లైసెన్స్ లేకుండా కేంద్రం నిర్వహిస్తున్నప్పటికీ తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండటం,అలాగే కొత్త డీఎంహెచ్ఓ లైసెన్స్ ఇప్పించేందుకు ఈ మొత్తాన్ని లంచంగా డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది.ఫిర్యాదుదారుడి నుంచి తీసుకున్న రూ.1,00,000 నగదును మద్దూరి కృష్ణయ్య వద్ద నుంచి ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విధులను సక్రమంగా నిర్వహించకుండా అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు అధికారులు పేర్కొన్నారు.ఈ కేసులో డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాస్, ప్రైవేట్ డ్రైవర్ మద్దూరి కృష్ణయ్యలను నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ వెల్లడించింది. ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా వెల్లడించలేదు.

# ఓటర్ల జాబితా సవరణ ఈసీ ప్రక్రియే

**ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాల విమర్శలు... బీజేపీ చీఫ్ రామచందర్ రావు కౌంటర్**

**దొంగ ఓటర్లను, చనిపోయిన ఓటర్లను తొలగించడమే లక్ష్యమని వ్యాఖ్య**

**ఓడిపోయినప్పుడల్లా ఈసీ, ఈవీఎంలపై నిందలు వేస్తారని విమర్శలు**



**హైదరాబాద్, అక్టోబర్ 5(ప్రజావినికిడి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియపై ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. ఇది బీజేపీ చేస్తున్న కార్యక్రమం కాదని, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన ప్రక్రియ అని స్పష్టం చేశారు. దొంగ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించడమే దీని ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు.

సోమవారం ఆయన మాట్లాడుతూ, "ఈ ప్రక్రియను బీజేపీ ప్రవేశపెట్టలేదు, ఇది ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియ అని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, ఇతర నేతలు తెలుసుకోవాలి. కాంగ్రెస్ హయాంలో కూడా ఇది జరిగింది. అప్పుడు వ్యతిరేకించని వారు ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?" అని ప్రశ్నించారు. కేరళలో ఎస్ఐఆర్ తర్వాత కాంగ్రెస్ గెలిచినా, దానికి వారి వద్ద సమాధానం లేదని ఎద్దేవా చేశారు."కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి ఎన్నికల్లో ఓడిపోయినప్పుడల్లా ఈసీపై లేదా ఈవీఎంలపై నిందలు వేయడం అలవాటుగా మారింది. గత 12 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉండటంతో ఓవైసీ, కాంగ్రెస్ పార్టీలూ 'కళ్లూళ్తో ఉన్నాయి. అందుకే ఎస్ఐఆర్ గురించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయి" అని రావు ఆరోపించారు. చనిపోయినవారు, నకిలీ ఓటర్లు, విదేశీయుల పేర్లను తొలగించడం, వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను అక్కడికి మార్చడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని ఆయన వివరించారు.

కాగా, ఈ ప్రక్రియ ద్వారా ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకేనని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఆదివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, దేశంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టాయి. ముసాయిదా జాబితా నుంచి 13 కోట్ల పేర్లను తొలగించారని వారు ఆరోపిస్తున్నారు. అయితే, అధికార బీజేపీ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది.

## రేవంత్ సర్కార్ కుట్రలు

(మొదటి పేజి తరువాయి)

ఆరోపించారు. రామప్ప దేవాలయానికి అతి సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం దారుణమని అన్నారు. మీటర్ల కొద్ది లోతులో తవ్వకాలు, బ్లాస్టింగ్స్ చేయడం వల్ల తెలంగాణ శిల్పకళకు ప్రతిరూపం, యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాల యానికి, రామప్ప చెరువుకు తీవ్ర ముప్పు వాటిల్లనుందని ఆందోళన వ్యక్తం చేశారు. వారసత్వ సంపదను ధ్వంసం చేసే కుట్రలను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని వెల్లడించారు. ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి హాని చేసే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## ఒక్కో ఉద్యోగికీ రూ.1,10,250 బోనస్.

ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా సింగరేణి కూడా బొగ్గు ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. రానున్న దసరా, దీపావళి, నవరాత్రుల పండుగల కానుకగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయమైనది. దేశానికి వెలుగులు పంచేందుకు పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ వెలకట్టలేనిది. సింగరేణి బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదు. సింగరేణి పరిశ్రమ మన తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారం. లక్షలాది కుటుంబాలకు జీవనాధారం. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో కీలక భాగస్వామి అని అన్నారు. దేశ ప్రగతిలో, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి మరింత కీలకపాత్ర పోషించాలని కిషన్? రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్?లో ట్వీట్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా సింగరేణికి ఇవ్వాల్సిన రూ.60 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు.

# కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

(మొదటి పేజి తరువాయి)

వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫారం 6లో మార్పులు వంటి పలు కీలక నిర్ణయాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన జరగాలని, కానీ ఇక్కడ అలా జరగలేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు.ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈసీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. "రాజ్యాంగబద్ధమైన సంస్థలు చట్టానికి లోబడి పనిచేయాలి. ఒకవేళ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే, వాటిని రద్దు చేస్తాం" అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే, సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ విధులకు ఆటంకం కలిగించేలా లేదా ఆయనను సస్పెండ్ చేసేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కోర్టు నిరాకరించింది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను సీఈసీ ఒక్కరే కాకుండా, ముగ్గురు సభ్యుల కమిషన్ సంయుక్తంగా వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో కోరారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు నోటీసులతో ఈ వ్యవహారంపై కేంద్రం, ఈసీ ఎలాంటి వివరణ ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

# ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు..

(మొదటి పేజి తరువాయి)

పాటు మరో నాలుగు అంతర్జాతీయ యూనివర్సిటీలు ఫ్యూచర్ సిటీలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపినట్లు అధికారులు సీఎస్‌కు తెలిపారు.విదేశీ వర్సిటీలను ఆహ్వానించడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, పెట్టుబడులకు అవకాశం కల్పించడం, అనుమతులు సులభతరం చేయడం, విద్యా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను పాలసీలో చేర్చాలని సంజయ్ జాజు సూచించారు. తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రతిపాదిత వర్సిటీల ప్రతినిధులతో చర్చలు జరిపి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నాటికి ఈ ప్రణాళిక సిద్ధంగా ఉండాలని సూచించారు.ఇదే సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్షించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దశలవారీగా ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2027 డిసెంబర్ నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయాలని, 2028 జూన్ నాటికి ఈ సంఖ్యను 87కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఒక్కో పాఠశాలను సుమారు 26 ఎకరాల్లో నిర్మించనున్నారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదుల వంటి సదుపాయాలు కల్పించనున్నారు. నిర్మాణ పనులను క్రమం తప్పకుండా సమీక్షించి, నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.

# సుప్రీంకోర్టు జడ్జిగా తెలంగాణ హైకోర్టు సీజే

**హైదరాబాద్/న్యూఢిల్లీ,(ప్రజావినికిడి):** :తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్.. సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టు జడ్జిగా ఆయన నియామకానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ జారీచేసింది. జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్‌తోపాటు గుజరాత్, ఢిల్లీ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ సునితా అగర్వాల్, జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయలకు కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించారు. ఈ ముగ్గురిని సుప్రీంకోర్టు జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం సెప్టెంబరు 28న కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆ సిఫారసుకు కేంద్రం తాజాగా ఆమోదం తెలిపినట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. తాజా నియామకాలతో దేశ సర్వోన్నత న్యాయస్థానం జడ్జిల సంఖ్య 37కు చేరింది. ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తితో కలిపి న్యాయమూర్తుల సంఖ్య 34 ఉండగా.. ఇటీవల సుప్రీంకోర్టు సవరణ చట్టం-2026 ప్రకారం ఈ సంఖ్యను 38కి పెంచారు. కాగా, సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులైన జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ 2025 జూలై 19న తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్?సగా ప్రమాణ స్వీకారం చేశారు. 1965 జూలై 7న జన్మించిన జస్టిస్ ఏకే సింగ్.. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ ఆనర్స్, ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. 1990లో పాట్నా హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. 1990 నుంచి 2000 సంవత్సరం వరకు పాట్నా హైకోర్టులో, 2001 నుంచి 2012 వరకు ఝార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012 జనవరి 24న ఝార్ఖండ్ హైకోర్టు అదనపు జడ్జిగా, 2014లో ఝార్ఖండ్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

# కలిసి పనిచేస్తాం

(మొదటి పేజి తరువాయి)

ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం ఉమ్మడి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం ఒకవైపు రాజకీయంగా, భౌగోళికంగా విభజనకు గురవుతున్న తరుణంలో భారత్ వంటి దేశాలతో భాగస్వామ్యం అత్యంత కీలకం అని మాట్లాడారు. ఏ అంతర్జాతీయ వేదిక అయినా భారత్ చర్చలు, సహకారానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని కూడా తాము అనుసరిస్తామని తెలిపారు. గ్లోబల్ టెక్నాలజీ చర్చల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలోనూ భారత్ అసాధారణ నాయకత్వ పటిమను ప్రదర్శించిందని పార్మెలిన్ అన్నారు. ఈ క్రమంలోనే 2026 ఫిబ్రవరిలో న్యూదిల్లీ వేదికగా భారత్ నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026' గొప్ప విజయాన్ని సాధించిందని ప్రశంసలు కురిపించారు. దీనికి 88 దేశాలు, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయని ఆయన గుర్తు చేశారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించే ఆర్టిఫిషియెల్ ఇంటెలిజెన్స్ విధానం ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సాంకేతిక ప్రయోజనాలు కొన్ని దేశాలు, సంస్థలకే పరిమితం కాకుండా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు చేరేలా భాగస్వామ్యం కల్పించడానికి, ఏఐ పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడానికి స్విట్జర్లాండ్ కృషి చేస్తుందన్నారు. 2027 జూన్‌లో జెనీవాలో స్విట్జర్లాండ్ నిర్వహించబోయే తదుపరి గ్లోబల్ ఏఐ సమిట్‌కు భారత్‌ను కీలక భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు పార్మెలిన్ పేర్కొన్నారు. ఇక్కడ ఆమోదించిన 'న్యూదిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్' మార్గదర్శకాల ఆధారంగానే తాము కూడా ముందుకు సాగుతామని వెల్లడించారు. భారత్-స్విట్జర్లాండ్ ఆర్థిక సంబంధాల్లో ఇండియా- యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ మధ్య జరిగిన (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) కీలకంగా మారుతోంది. భారత్, స్విస్, నార్వే, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టెయిన్‌లతో కూడిన మధ్య కుదిరిన ఈ డీల్ 2025, అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వచ్చింది. ఈ డీల్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, దీని అమలు తీరుపై తాము చాలా సంతోషంగా ఉన్నామని పార్మెలిన్ వెల్లడించారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చాక స్విస్ కంపెనీల నుంచి ఆసక్తి బాగా పెరిగిందన్నారు. రానున్న సంవత్సరాల్లో భారత్- స్విట్జర్లాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారు

(మొదటి పేజి తరువాయి)

జ్ఞానేశ్ కుమార్ నిబంధనలకు విరుద్ధంగా, ఏకపక్షంగా ఫారమ్-6లో మార్పులు చేశారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై జరిగిన ఈ నేరపూరిత దాడిలో జజుజతో పాటు బాధ్యులైన ప్రతి ఒక్కరినీ జవాబుదారీగా నిలదీస్తామని ఆయన హెచ్చరించారు. జ్ఞానేష్ కుమార్ ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారని ఇప్పుడు నిస్సందేహంగా రుజువైందని అన్నారు. బీజేపీకి సహాయం చేయడానికి ఆయన తన పదవిని దుర్వినియోగం చేస్తున్నాడనడానికి ఇది మరో రుజువు అని తెలిపారు. తన ఆరోపణకు మద్దతుగా గతంలో ఈసీఐ విడుదల చేసిన పత్రికా ప్రకటన చిత్రాన్ని కూడా పంచుకున్నారు. అందులో "సర్ కోసం ఫారం 6కు జతచేసిన ప్రకటనను సుప్రీంకోర్టు సమర్థించింది. సర్ లేని కాలానికి, నిబంధనల (ఓటర్ల నమోదు నిబంధనలు 1960) ప్రకారం వర్తించే ఫారాలను ఉపయోగించాలి." అని అందులో ఉంది. మరోవైపు ప్రక్రియలో జరిగిన పేర్ల తొలగింపులు రాజ్యాంగం, ఎన్నికల ప్రక్రియ మౌలిక సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ప్రజలు ఇప్పుడు గ్రహించారని ఆమె స్పష్టం చేశారు. "జరిగిన ఈ తొలగింపులు మన రాజ్యాంగం, ఎన్నికల ప్రక్రియ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టంగా తెలుస్తోంది. దీనిపై మేము నిరసన వ్యక్తం చేస్తున్నాం. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ప్రజలు గ్రహించారని నేను భావిస్తున్నాను. కాబట్టి మా నిరసనను కొనసాగిస్తాం." అని అన్నారు. సీఈసీ స్పష్టంగా, నిస్సందేహంగా అబద్ధం చెప్పారని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ విరుచుకుపడ్డారు. ప్రధాని భయపడే జెన్ జెడ్ ఓటర్లను తొలగించడానికి సీఈసీ స్వయంగా ఫారం 6ను ఉద్దేశపూర్వకంగా సవరించారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్? షాల ఆదేశాలతో రాజ్యాంగానికి తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. ఆప్ నేత మనీష్ సిసోడియా ఆ మార్పులపై ప్రశ్నలు లేవనెత్తారు. ఫారం 6ను మార్చడానికి జ్ఞానేష్ కుమార్ అనుమతి తీసుకోలేదని సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని సిసోడియా అన్నారు. జ్ఞానేష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మార్పులు ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు ప్రక్రియపై ప్రభావం చూపవచ్చని సిసోడియా ఆరోపించారు. ఫారం 6 అనేది ఒక దరఖాస్తు. దీని ద్వారా అర్హత ఉన్న వ్యక్తి మొదటిసారిగా ఓటర్ల జాబితాలో చేరాలని కోరుకుంటారు.

# చింతల్‌మెట్‌లో ఆలయ స్థలాల వివాదంపై అధికారుల పరిశీలన

**అక్రమ నిర్మాణాల తొలగింపుపై ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచనలు..**

**మతపరమైన ఉద్రిక్తతలకు తావులేకుండా పరిష్కారం**



**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 5,**
చింతల్‌మెట్ పరిధిలోని శ్రీ ఆస్థాన వీరభద్ర స్వామి ఆలయం వద్ద అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలకు సంబంధించిన వివాదంపై అధికారులు దృష్టి సారించారు. ఆలయ పరిసరాల్లో నెలకొన్న పరిస్థితులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్, రాజేంద్రనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్, దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు, కోనేరు ప్రాంతంతో పాటు అక్కడి నిర్మాణాలను అధికారులు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ, ఆలయ కోనేరు వద్ద నెలకొన్న సమస్యను ఎవరికి ఇబ్బంది కలగకుండా చట్టపరంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో అన్ని వర్గాల భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకుని అధికారులు ముందుకు వెళ్లాలని సూచించారు. ఆలయం, మసీదు స్థలాలకు ఆనుకుని బషీర్ అనే వ్యక్తి కాంపౌండ్ వాల్ నిర్మించారని ఎమ్మెల్యే తెలిపారు. సంబంధిత నిర్మాణాన్ని తొలగించేందుకు అధికారులు వెళ్లిన సమయంలో మసీదును కూల్చివేస్తున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈ అంశాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రకాష్‌గౌడ్ తెలిపారు. ఎలాంటి మతపరమైన వివాదాలకు అవకాశం లేకుండా, అందరి సహకారంతో సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. అదేవిధంగా ఆలయ, మసీదు స్థలాలకు సంబంధం లేని ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలు ఏమైనా ఉంటే వాటిని అధికారులు నిబంధనల



ప్రకారం తొలగించాలని ఎమ్మెల్యే కోరారు. స్థలాల హద్దులు, నిర్మాణాల చట్టబద్ధతపై సంబంధిత శాఖలు పూర్తిస్థాయిలో పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు అఖిలపక్షాల ఐక్యగళం

**కలెక్టరేట్ ఎదుట నేడు భారీ నిరసన**





**శంషాబాద్, అక్టోబర్ 5 (ప్రజావినికిడి):** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అఖిలపక్ష నాయకులు ఐక్యమయ్యారు. శంషాబాద్‌లోని కశీష్ ప్యాలెస్‌లో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న నిరసన కార్యక్రమంపై చర్చించారు. ఏఐసీసీ, సీపీఐ, సీపీఎం, ఇండియా కూటమి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవ్ డెమోక్రసీ వీక్'లో భాగంగా అక్టోబర్ 6న ఉదయం10 గంటలకు కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన నిర్వహించాలని నిర్ణయించారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులు చర్చించారు. జిల్లా, మండల, డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నిరసనను విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, సానెం శ్రీనివాస్‌గౌడ్, సీపీఎం కార్యదర్శి బోడ సామేలు, సీపీఐ నాయకులు పాలమాకుల జంగయ్య, ఎం.ఏ.ఖలీద్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ శాంతి పురస్కారాలు 2026 ఎంపిక





**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు అబిడ్స్ లోని బొగ్గుల కుంట లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో మహాత్మా గాంధీ 157వ జయంతి అదేవిదంగా అంతర్జాతీయ అహింస దినోత్సవం ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, విద్యావేత్తలు, స్వచ్ఛంద సేవా సంస్థలు,సమాజ సేవకులకు మహాత్మా గాంధీ శాంతి పురస్కారాలు 2026 కు ప్రశంసా పత్రం,జ్ఞాపిక, పూలమాల, శాలువాతో ఘనంగా పురస్కారాలు ప్రధానం చేస్తున్నామని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ నేడు పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ శాస్త్రవేత్త సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ టి.అంజనీ దేవి,తోపాటు డాక్టర్ దీపిక, మడిగల విజయభాస్కర్ రెడ్డి,గాజుల అంజయ్య, డాక్టర్ ఎం. సంగీతారెడ్డి, డాక్టర్ రవితేజ, డాక్టర్ ఎం.రాజ్ కుమార్,డాక్టర్ పి.అశ్విని రెడ్డి, ఎస్. మధుసూదన్, పి.సుందర్, తరుణ్ కుమార్ మెహతా,ఎడ్ల బాలరాజ్, కుంబర్తి రవీందర్, ఎం కిరణ్ మై, మిత్ర జాన్ బునియన్, మహమ్మద్ సాహెబ్ రూమి, కె.జోజి రెడ్డి,కె. ప్రపూర్ణ రెడ్డి,శ్రీ జమీల్ రబ్బాని లకు మహాత్మా గాంధీ శాంతి పురస్కారం ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయ శాస్త్ర నిపుణులు సీనియర్ ప్రొఫెసర్ అలాగే తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకృష్ణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రముఖ సాహితీవేత్త ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ మాజీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ కోర్టు మాజీ చైర్మన్ జస్టిస్ వామన్ రావు,లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పన్ డైరెక్టర్ లయన్.ప్రేమ్ చంద్ జైన్, ప్రొఫెసర్ రిటైర్డ్ ఇంటర్నేషనల్ ఆర్బిటర్ చెస్, ప్రెసిడెంట్ యునైటెడ్ ఏపీ చెస్ అసోసియేషన్ మేజర్ కె. ఎ.శివప్రసాద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

# ప్లాస్టిక్ వాడకంపై నిషేధం విధించిన గుమ్మడిదొడ్డి సర్పంచ్



**వాజేడు, అక్టోబర్ 6,(ప్రజావినికిడి):**
వాజేడు మండలం గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ నివారణపై స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొదెబోయిన భరత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కలిసి ప్రతి ఇంటికి,కిరాణ దుకాణాలకు వెళ్లి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, పర్యావరణ నష్టంపై ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ వాడితే చట్టపరమైన చర్యలతో పాటు పంచాయతీ నుండి జరిమానాలు విధించబడతాయని సర్పంచ్ భరత్ కుమార్ హెచ్చరించారు. గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

# రూ.91 లక్షలతో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్ (ప్రజావినికిడి): అక్టోబర్ 5,** నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ఆధ్వర్యంలో రూ.91 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న నూతన సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మ్యాక్ క్యాజిల్ అపార్ట్‌మెంట్స్ నుంచి జనచైతన్య కాలనీ ఫేజ్-1లోని ప్లాట్ నంబర్ 51,రోడ్ నంబర్ 4 వరకు 300 మి.మీ. వ్యాసంతో సీవరేజ్ పైప్‌లైన్‌ను నిర్మించనున్నారుఈ పైప్‌లైన్ అందుబాటులోకి వస్తే ఆయా ప్రాంతాల్లో చాలాకాలంగా కొనసాగుతున్న మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించనుంది. మురుగునీరు నిల్వ ఉండటం, డ్రైనేజీ ఇబ్బందులతో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు తగ్గనున్నాయి. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను సూచించారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య సదుపాయాలు కల్పించడంతోపాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్





**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేయగా వాటిపై వారు సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్దే తమ ప్రథమ ప్రాధాన్యత అని అన్నారు.

# పి.ఆర్.టి.యు. తెలంగాణ వాజేడు మండల నూతన కార్యవర్గం ఎన్నిక

**సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి..**

**పి.ఆర్.టి.యు. తెలంగాణ జిల్లా అధ్యక్షులు కొయ్యడ సురేందర్**

**పీఆర్సీ అమలు చేయాలి.**

**ఈఎచ్ఎస్ ద్వారా పూర్తి క్యాష్‌లెస్ వైద్యం అందించాలి..**



**వాజేడు,అక్టోబర్ 6,(ప్రజావినికిడి):**
వాజేడు మండల కేంద్రంలో పి.ఆర్.టి.యు. తెలంగాణ నూతన మండల కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల హక్కుల సాధన, విద్యారంగ అభివృద్ధి కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన మండల కార్యవర్గాన్ని ప్రకటించారు. మండల అధ్యక్షులుగా కరుటూరి సతీష్ కుమార్,ప్రధాన కార్యదర్శిగా బాల సంధ్య, గౌరవ అధ్యక్షులుగా షేక్ సిరాజుద్దీన్, మండల మహిళా అధ్యక్షులుగా గద్దల యశస్విని, అసోసియేట్ అధ్యక్షులుగా యనమల్ల రాజు, ఉపాధ్యక్షులుగా పబ్బ రమేష్, కార్యదర్శిగా గొల్లపెల్లి విగ్నేష్, మహిళా కార్యదర్శిగా డి. దేవా కరుణ ఎన్నికయ్యారు.
ఈ కార్యవర్గ సమావేశానికి పి.ఆర్.టి.యు. తెలంగాణ ములుగు జిల్లా అధ్యక్షులు కొయ్యడ సురేందర్,జిల్లా ప్రధాన కార్యదర్శి పోరిక రామన్న నాయక్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రౌతు రాజు,రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్వతాల సతీష్, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఇరుసవడ్ల జగన్ కుమార్,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు అమిరిశెట్టి సారంగపాణి, జిల్లా ఉపాధ్యక్షులు దయ రాజు రమేష్,జిల్లా ఉపాధ్యక్షులు చాట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.
ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలిఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సురేందర్ మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెరుగుతున్న వైద్య ఖర్చుల నేపథ్యంలో ఈఎచ్ఎస్, ఎంప్లాయి హెల్త్ స్కీమ్ ద్వారా పూర్తి స్థాయిలో క్యాష్‌లెస్ వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, బదిలీలు,సర్వీస్ సంబంధిత సమస్యల పరిష్కారంతో పాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. నూతనంగా ఎన్నికైన మండల కార్యవర్గ సభ్యులకు నాయకులు అభినందనలు తెలియజేస్తూ, వాజేడు మండలంలోని ఉపాధ్యాయులందరినీ సంఘటితం చేసి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేయాలని సూచించారు. నూతన కార్యవర్గం తమపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

# కాలనీలలో డ్రైనేజీ,వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిందిగా వినతి



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి కాలనీలో డ్రైనేజీ అదేవిదంగా వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిందిగా విజ్ఞప్తి చేస్తూ, సోమవారం దుర్గేష్ స్టేట్‌లో డిప్యూటీ కమిషనర్ అలాగే సంబంధిత శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో కాలనీలకు సంబంధించిన వాటర్ వర్క్స్, డ్రైనేజీ సమస్యను, అదేవిధంగా వర్షపు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాల్సిందిగా కాలనీవాసుల తరపున అధికారులకు విజ్ఞప్తి చేశారు. హెచ్.ఏ.ఎల్ రాఘవేంద్ర కాలనీ, ఎరునాటికల్ ఎన్‌క్లేవ్, ఎస్.ఆర్.డీ.జీ. స్కూల్, శ్రీ రాఘవేంద్ర నగర్ తదితర కాలనీల తరపున అందరం కలిసి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన అధికారులను పంపించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిందిగా అధికారులకు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ముఖ్యంగా,వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు బాక్స్ నాలా నిర్మాణం కోసం అవసరమైన ఎస్టిమేట్‌ను తయారు చేసి, దానికి ఆమోదం మంజూరు చేసి, పనులను త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిందిగా కాలనీ వాసుల తరఫునతరఫున విజ్ఞప్తి చేశారు. వినతికి అధికారులు సానుకూలంగాస్పందించి,సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్.ఏ.ఎల్ రాఘవేంద్ర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కుంట సిద్ది రాములు, కార్యదర్శి నగేష్ రెడ్డి, ఎరునాటికల్ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కీర్తి కనకయ్య,శ్రీ రాఘవేంద్ర నగర్‌కు చెందిన సతీష్,శ్రీనివాస్, తదితరులు పాల్గొని అధికారులకు వినతిపత్రాలు సమర్పించడం జరిగింది.

# నాటి కేసీఆర్ సంకల్పమే..
# నేటి కల్యాణ లక్ష్మికి 12 ఏళ్లు పూర్తి

**పేద యువతులకు అండగా నిలిచిన మేనమామ,పెద్దన్న కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం**
**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** తెలంగాణ రాష్ట్ర సాధకులు, మాజీ సీఎం కేసీఆర్ దృఢ సంకల్పంతోనే కళ్యాణ లక్ష్మి పథకం పురుడు పోసుకుందని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు.సోమవారం రోజు పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో కల్యాణ లక్ష్మి పథకం ప్రారంభమై 12 ఏళ్లు గడిచిన శుభ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం మాట్లాడారు. గతంలో ఎంతోమంది తమ పిల్లలకు పెళ్లిళ్లు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారని,ఒకానొక సమయంలో ఆడపిల్లలను కనాలంటేనే భయపడే పరిస్థితికి వచ్చిందని,నాటి పరిస్థితులను గమనించిన కేసీఆర్ పేద ప్రజలకు అండగా నిలవాలనే ఉద్దేశం తో కళ్యాణ లక్ష్మి పథకాన్ని రూపొందించారని గుర్తు చేశారు. గిరిజన కుటుంబంలో జరిగిన ఇబ్బందులను గుర్తించి నాడు 50 వేల ఆర్థిక సాయంతో ప్రారంభించిన పథకం రూ.లక్ష వరకు చెల్లించి పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. మూడోసారి అధికారంలోకి వస్తే మూడు లక్షల నగదును కల్యాణ లక్ష్మి పథకం ద్వారా పేద యువతలకు అందిస్తామని కేసీఆర్ ప్రకటిస్తే,మోసపూరిత మాటలతో కాంగ్రెస్ లక్ష రూపాయల నగదు తో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక పథకాన్ని పూర్తిగా మర్చిపోయారని ఆరోపించారు. మహిళల సంక్షేమం కోసం కెసిఆర్ చిత్తశుద్ధితో పనిచేస్తే,నేటి ముఖ్యమంత్రి మహిళల అభివృద్ధిపై కనీస ధ్యాస లేదని ఆరోపించాను.కళ్యాణ లక్ష్మి ప్రారంభమై 12 ఏళ్లు గడవడం శుభసందర్భమని కేసీఆర్ చేసిన పనితీరును మరోమారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో మహిళా కోర్డినేటర్ రాజ్యలక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య,మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలత,ఫరూఖ్ నగర్ మండల మహిళ అధ్యక్షులు సుష్మా రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మౌనిక, కౌన్సిలర్లు పిల్లి శారద,జి.టి వసంత,ఒగ్గు జయలక్ష్మి, నడికూడ అనిత,చల్లా వాణి,మాజీ కౌన్సిలర్లు ప్రేమలత, జూపల్లి కౌసల్య,సర్పంచ్ నాళ్ళపురం రాధిక,మహిళా నాయకులు విజయలక్ష్మి, కృష్ణవేణి,పద్మమ్మ తదితరులు, మహిళలు పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చొరవతో మంజూరైన
# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**లబ్దిదారులకు అందజేసిన బీఆర్ఎస్ నాయకులు**



**కొందుర్గు,(ప్రజావినికిడి):**
ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఈరోజు లబ్ధిదారులకు మండలం కేంద్రం లో ప్రజాప్రతినిధులు,బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు.
జిల్లేడ్ చౌదరి గూడ మండలం లోని పలు గ్రామాల వారికి మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులు వివరాలు..

1)గొల్ల రాజు చౌదరి గూడ 60000రూపాయలు
2)పర్వతాపురం పారిజాతం చౌదరి గూడ గారికి 14500రూపాయలు
3)మంగలి ఆంజనేయులు చౌదరి గూడ 20000రూపాయలు
4)కుర్వ నర్సింలు ఎల్కగూడ 26500రూపాయలు
5)రైసా బేగం ఎల్కగూడ 14500రూపాయలు
6)గిరి మొని మంగమ్మ పెద్ద ఎల్కిచర్ల 32000రూపాయలు
7)జోగు రమేష్ ఏదిరా గారికి 41000రూపాయలు
8)వడ్ల భ్రమయ్య చేగిరెడ్డి ఘనపూర్ 51000 రూపాయలు
9)పిట్ట తిరుమలమ్మ తుమ్మలపల్లి 10000 రూపాయలు
10)కె. పురుషోత్తం తుమ్మలపల్లి 31500 రూపాయలు
11)మంగలి శివకుమార్ వీరన్నపేట్ కు 27000 రూపాయలుఅందజేశారు.

చెక్కులు తీసికున్నవారు గౌరవ ఏమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లెడ్ చౌదరి గూడ మండల మాజీ సర్పంచ్ల సంఘశీ అధ్యక్షులు మీదిగడ్డ బాబురావు జిల్లెడ్ చౌదరి గూడ బి ఆర్ ఎస్ మాజీ అధ్యక్షులు నర్సింగ్ రావు, మాజీ జెడ్పిటిసి రామకృష్ణ, మహాదేవపూర్ సర్పంచ్ అనుష రవీందర్ రెడ్డి, మల్కాపహాడ్ గ్రామ సర్పంచ్ రవీందర్ నాయక్,పెద్ద ఎల్కి చర్ల గ్రామ సర్పంచ్ సోని శేఖర్,బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు ఎండీ జబ్బార్, రమేష్ నాయక్, మాజీ ఎంపీటీసీ లు శ్రీనివాస్ రెడ్డి,రమేష్, చింత కుంట గ్రామ మాజీ మాజీ సర్పంచ్ హరి నాయక్,జాకారం గ్రామ మాజీ సర్పంచ్ శ్రీశైలం, గోపాల్ నాయక్,పెద్ద ఎల్కి చర్ల గ్రామ ఉప సర్పంచ్ గుడిసె బాలరాజ్,తుమ్మలపల్లి గ్రామ ఉప సర్పంచ్ చంద్రశేఖర్, ఎల్కగూడ గ్రామ ఉప సర్పంచ్ అనంతమ్మ,ఇంద్రనగర్ గ్రామ ఉప సర్పంచ్ మంగలి శేఖర్,జనార్దన్ గౌడ్,నవీన్ పటేల్, తుమ్మలపల్లి శేఖర్,ప్రకాష్, మన్నే నాయక్, ని . రాం రెడ్డి , వై . రాం రెడ్డి , వై . ప్రవీణ్,శేఖర్,నర్సింలు,కుమ్మరి శేఖర్, లక్ష్మీదేవిపల్లి, హరిశ్వర్ రెడ్డి,తూంపల్లి సురేష్,దశరథ్, భూపాల్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, వెంకట్ రెడ్డి,జగదీష్,మల్లా రెడ్డి, ప్రవీణ్,కుర్వ యాదయ్య,సి. శ్రీవాస్ రెడ్డి భూపాల్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి,కార్తీక్,లతీఫ్, కోరే శ్రీనివాస్, తులసి రాం, మనోహర్, వెంకట్ రెడ్డి, యాదయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు



# ప్రొ.ఖాసిం, నాగరాజ్ కున్నె ను సన్మానించిన టీఎన్జీవోస్ నేత రాజ్ కుమార్

**ఘనంగా నిజాం కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** నిజాం కళాశాలలో 19921998 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. నిజాం కళాశాల పూర్వ విద్యార్థులు నాగరాజ్ కున్నె, బత్తుల కృష్ణ, బాలు గుండు, బాబా,ప్రభు, రాజేష్,రమేష్, బుర్రా శ్రీనివాస్, బాబురావు ఆధ్వర్యంలో ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నల్గొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్ నేత,ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. ఖాసిం, టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ తెలంగాణ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు కె.ఆర్. రాజ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.ఈ ఆత్మీయ సమ్మేళనంలో సుమారు 400 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని,తమ కళాశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించిన నిజాం కళాశాల పూర్వ విద్యార్థులు నాగరాజ్ కున్నె, బత్తుల కృష్ణ, బాలు గుండు, బాబా,ప్రభు, రాజేష్,రమేష్, బుర్రా శ్రీనివాస్, బాబురావుతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్



ప్రొఫెసర్ సి. ఖాసింను టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ తెలంగాణ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు కె.ఆర్. రాజ్‌కుమార్ శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఆత్మీయ సమ్మేళనం నిర్వాహకులు టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ తెలంగాణ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు కె.ఆర్. రాజ్‌కుమార్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వాసుదేవ్‌రెడ్డి, సత్యజిత్‌రాయ్, శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చైతన్య, రామకృష్ణారెడ్డి, బాలాజీ గోస్వామి,ప్రవీణ్, శివ,గంగాధర్, లక్ష్మీపతి,ప్రదీప్, శ్రీనివాస్, మోహన్, లక్ష్మణ్‌సింగ్, ఫజియుల్లా, దీపక్, బాబురావు, కిరణ్, జయపాల్, ఓంప్రకాశ్, సునీల్,టి. శ్రీధర్‌రెడ్డి,కె. గోపిరెడ్డి, అనూప్‌సాగర్, కళ్యాణ్,ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్య పరిష్కారం కాక రైతు మృతి

**అభివృద్ధి కోసం టీజీఐఐసీకి భూమి అప్పగించిన రైతు**

**మరణం తర్వాతైనా కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్**

**టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు.**





**రంగారెడ్డి,(ప్రజావినికిడి):** భూ సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయిన రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని రైతు గుండెపోటుతో మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు,మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు.షాబాద్ మండల కేంద్రంలో విలేకరుల ఏర్పాటుచేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాబాద్ మండలం తిమ్మారెడ్డిగూడకు చెందిన వానరాసి యాదయ్య(55)కు తాళపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 483లో 4 ఎకరాల లావణి భూమి ఉంది.అభివృద్ధి పనుల కోసం భూమిని స్వాధీనం చేసుకుని టీజీఐఐసీకి అప్పగించిన నేపథ్యంలో పరిహారంగా హెచ్ఎండీఏ లేఅవుట్‌లో ఎకరాకు 800 గజాల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాల్సి ఉందని తెలిపారు. అయితే రికార్డుల్లో భూమి వివరాలు కనిపించకపోవడంతో ప్లాట్లు కేటాయించలేదని,సమస్య పరిష్కారం కోసం యాదయ్య పలుమార్లు అధికారులను ఆశ్రయించినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు.ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురైన గుండెపోటుతో మృతి చెందారని తెలిపారు.రికార్డుల్లో అవకతవకలపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# ఉపాధితో పాటు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి

**రంగారెడ్డి జిల్లా డిడిపఈ అనిత ఆదేశం -మండలంలోని హాజపల్లి గ్రామంలో జ్యూట్ బ్యాగ్ శిక్షణ కేంద్రం సందర్శన**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
మండలం హాజీపల్లి గ్రామంలోని డిడబ్ల్యూసిఆర్‌ఏ భవనంలో ఆర్ సైట్ అలాగే ఫెమినా మహిళా సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్యూట్ బ్యాగ్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. మహిళలకు అందిస్తున్న శిక్షణ,ఉపాధి అవకాశాలు, శిక్షణ ద్వారా వారి ఆర్థిక స్వావలంబనకు కలుగుతున్న ప్రయోజనాలను పరిశీలించారు.ఈ సందర్భంగా (ఉల్లాస్) కార్యక్రమంపై మహిళలకు అవగాహన కల్పించారు.హాజీపల్లి గ్రామాన్ని 100 శాతం అక్షరాస్యత సాధించిన గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా మహిళలు తమ కుటుంబ సభ్యులతో పాటు నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యత కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో శ్రీకాంత్‌ను కలిసి ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అవసరమైన సిబ్బంది సహకారం అందించాలని కోరారు. గ్రామస్థాయిలో అక్షరాస్యత కార్యక్రమాలపై నిరంతర పర్యవేక్షణ,అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.అదేవిధంగా డి ఆర్ డి ఓ,ఎస్ ఇ ఆర్ పి,ఏపీఎంకు 3 నుంచి 5 ఉచిత కుట్టు



మరియు జర్దోసీ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తుల సేకరణ చేపట్టాలని సూచించారు.మహిళలకు నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను మరింత విస్తరించాలని తెలిపారు.డి ఆర్ డి ఓ -రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూషన్స్ ద్వారా గ్రామీణ ప్రాంతం లోని యువతీ యువకులకు వారి వారి గ్రామాలలో నే ఉదయం & మధ్యాహ్నం టీ లతో పాటుగా మధ్యాహ్నం ఉచిత భోజన వసతి కూడా వారే ఇస్తారు.శిక్షణ అనంతరం ఎస్ హెచ్ జి మహిళలకు శ్రీనిధి బ్యాంకు ద్వారా లోన్ సౌకర్యం కు మార్గదర్శకత్వం చేసి వ్యాపారాభివృద్ధికి మార్గదర్శకత్వం వహిస్తారు అని తెలియచేసారు.ఆసక్తి వున్న వారు సదరు మండల మహిళా సమాఖ్య లోని ఏటీఎం లకు వారి ఆధార్ కార్డు & వైట్ రేషన్ కార్డు కాపీలకు జత చేసి సమర్పించవలెను అని తెలియ



చేశారు.ఉచిత శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న లబ్ధిదారుల సహకారంతో ఉల్లాస్ బోధనా తరగతులను పునఃప్రారంభించి, ఉపాధి-అక్షరాస్యత కార్యక్రమాలను సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.మహిళల ఆర్థిక సాధికారతతో పాటు విద్యా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఫెమినా మహిళా సేవ సమితి స్థాపకురాలు శ్రీమతి అలియా మాట్లాడుతూ, ఈ ఉపాధి ద్వారా మహిళలువారి జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకోవచ్చును తద్వారా సమాజభివృద్ధి జరుగుతుందని తెలియ చేశారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తెకు ఎమ్మెల్సీ పదవి?

**గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా పవిత్రవాణి పేరు పరిశీలన**

**హైదారాబాద్, అక్టోబర్ 5(ప్రజావినికిడి):**
తెలంగాణలో త్వరలో ఖాళీ కానున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. తెలంగాణ ఉద్యమ పితామహుల్లో ఒకరైన కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తె పవిత్రవాణి పేరును ఓ స్థానానికి పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ఆమె, ప్రస్తుతం వైద్యవృత్తిలో ఉన్నారు. సిరిసిల్ల సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఒక ఎమ్మెల్సీ సీటును పద్మశాలి వర్గానికి కేటాయిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969 ఉద్యమ సమయంలో మంత్రి పదవికి రాజీనామా చేసిన తొలి నేతగా కొండా లక్ష్మణ్ బాపూజీ చరిత్రలో నిలిచారు. అయితే, రాష్ట్రం ఏర్పడ్డాక ఉద్యమకారుల కుటుంబాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పటి నుంచీ ఆరోపిస్తున్నారు. సీఎం అయ్యాక ఆ దిశగా చర్యలు చేపట్టారు. ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఎమ్మెల్సీగా, శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనుమరాలిని మహిళా కమిషన్ సభ్యులుగా నియమించారు. ఈ క్రమంలోనే తాజాగా బాపూజీ కుమార్తెకు అవకాశం ఇవ్వాలనే ప్రతిపాదన వచ్చినట్లు సమాచారం.నవంబర్ 14న ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్‌ల పదవీకాలం ముగియనుంది. ఈ మూడు స్థానాల్లో ఒకదాన్ని పద్మశాలి వర్గానికి కేటాయించనున్నారు. పవిత్రవాణిని ఎంపిక చేయడం ద్వారా ఉద్యమ కుటుంబానికి గౌరవం కల్పించడంతో పాటు, బీసీలు, మహిళల్లో పార్టీకి సానుకూల వాతావరణం ఏర్పడుతుందని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# డ్రగ్స్ రహిత సమాజం కోసం మరో ముందడుగు

## డా.సామ రవీందర్ రెడ్డి రచించిన మంచి జీవితం కోసం మత్తుకు దూరంగా పుస్తకం -పుస్తక ఆ విష్కరణ చేసిన డీజీపీ సివి ఆనంద్

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** మాదకద్రవ్యాల దుర్వినియోగం,దాని దుష్పరిణామాలు,నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో రాజేంద్రనగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు డా.సామ రవీందర్ రెడ్డి రచించిన మంచి జీవితం కోసం మత్తుకు దూరంగా'పుస్తకాన్ని తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ సోమవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనలో సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం,పోలీసుశాఖ చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. పోలీసుశాఖ,ఈగల్ ఫోర్స్ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం,ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు.

### మారకద్రవ్యాల వినియోగం సమాజంపై ప్రతికూల ప్రభావం

మాదకద్రవ్యాల వినియోగం ఒక వ్యక్తి జీవితానికే పరిమితం కాకుండా కుటుంబం,సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని డీజీపీ అన్నారు.డ్రగ్స్‌కు అలవాటు పడిన తర్వాత నివారణ చర్యలు చేపట్టడం కంటే, ముందుగానే అవగాహన కల్పించడం మరింత ముఖ్యమని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్యాసంస్థలు, అధ్యాపకులు,తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు,యువత సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో యువత,విద్యార్థులతో పాటు మహిళలు, చిన్నారులకు కూడా మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డీజీపీ పేర్కొన్నారు.డ్రగ్స్ ఏ రూపంలో ఉన్నా వాటి నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### డిజిపి సివి ఆనంద్ అభినందన

ఈ సందర్భంగా డా.సామ రవీందర్ రెడ్డిని డీజీపీ సీవీ ఆనంద్ అభినందించారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు సామాజిక సమస్యలపై స్పందిస్తూ విద్యార్థులు,ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు.డా.సామ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకావిష్కరణతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు.మంచి జీవితం కోసం మత్తుకు దూరంగా' పుస్తకం తెలంగాణలోని విద్యాసంస్థలు,కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అందుబాటులో ఉండాల్సిన పుస్తకంగా రూపొందించామని తెలిపారు.పాఠశాలలు,



కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు తమ క్యాంపస్‌లలో మాదకద్రవ్యాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఇందులో సమగ్రంగా వివరించినట్లు చెప్పారు. విద్యార్థులు, యువత తప్పనిసరిగా చదవాల్సిన విధంగా పుస్తకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.

మంచి జీవితం కోసం మత్తుకు దూరంగా ఉండాలంటే ముందుగా అవగాహన అవసరం. మత్తుకు అలవాటు పడిన తర్వాత నిర్మూలన చర్యల కంటే ముందుగానే నివారణకు కృషి చేయడం ఎంతో ముఖ్యం అని డా.రవీందర్ రెడ్డి అన్నారు.

### మన చదువు సమాజానికి ఉపయోగపడాలి

మన చదువు మన కోసమే కాకుండా సమాజం కోసం కూడా ఉపయోగపడాలిఅనే ఆలోచనతో ఒకవైపు విద్యార్థుల విద్యా అవసరాలకు ఉపయోగపడే పుస్తకాలను, మరోవైపు సామాజిక సమస్యలపై అవగాహన కల్పించే పుస్తకాలను రచిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ పోలీసుశాఖ అవకాశం కల్పిస్తే రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాల్లో తన వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

ఈ పుస్తకానికి తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి,ఐఏఎస్, తెలంగాణ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సీనియర్ ఐపీఎస్ అధికారి సందీప్ శాండిల్య ముందుమాటలు రాసినందుకు డా. రవీందర్ రెడ్డి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు డా.కె.సురేందర్ రెడ్డి,కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, పోలీసుశాఖ,ఎక్సైజ్ శాఖ అధికారులు,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని డా.సామ రవీందర్ రెడ్డిని అభినందించారు.






## శంషాబాద్ విమానాశ్రయంలో రూ.1.20 కోట్ల విలువైన బంగారం సీజ్



**శంషాబాద్ (ప్రజావినికిడి):** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు భారీగా బంగారం పట్టుకున్నారు. సోమవారం ఓ ప్రయాణికుడి నుంచి సుమారు 800 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 1.20 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.పక్కా సమాచారం మేరకు డీఆర్ఐ అధికారులు ఈ ఆపరేషన్ నిర్వహించారు. తిరుచ్చిరాపల్లి నుంచి ఇండిగో విమానంలో వచ్చిన ఓ ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని హైదరాబాద్‌కు చెందిన నగల వ్యాపారిగా గుర్తించారు. అతని లగేజీని తనిఖీ చేయగా, అక్రమంగా తరలిస్తున్న బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. తొలుత కస్టమ్స్ అధికారులు సాధారణ తనిఖీల్లో ఈ బంగారాన్ని గుర్తించారు. అనంతరం ప్రయాణికుడిని విచారణ కోసం డీఆర్ఐ అధికారులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## ఏసీబీ వలలో మెహదీపట్నం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్

### 4 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిన అధికారిణి సునీత

### నిర్మాణ అనుమతుల కోసం రూ.4 లక్షలు లంచం డిమాండ్

**హైదరాబాద్, అక్టోబర్ 05(ప్రజావినికిడి): ):** మెహదీపట్నం జీహెచ్ఎంసీ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీత రూ.4 లక్షలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయింది. నిర్మాణ అనుమతులు, క్లియరెన్స్‌కు సంబంధించిన వ్యవహారంలో లంచం డిమాండ్ చేసినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఏసీబీ అధికారులు పక్కా ఫ్లాన్‌తో వల పన్ని పట్టుకున్నారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ తులసీ రామ్ సునీత తన అధికారాన్ని దుర్వినియోగం చేయడమే కాకుండా అనుచిత లబ్ది పొందేందుకు యత్నించినందుకుగాను ఆమెపై ఏసీబీ అధికారులు చట్టపరమైన కేసులు నమోదు చేశారు. ఈ మేరకు నిందితురాలిని నాంపల్లిలోని అడిషనల్ ప్రత్యేక జడ్జి ముందు హాజరుపర్చినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్నందున భద్రతా కారణాల రీత్యా ఫిర్యాదుదారు వివరాలను వెల్లడించడం లేదని స్పష్టం చేశారు. ఇదే రోజు అంతకుముందు రంగారెడ్డి జిల్లా స్వర్ణ కుమారి ఏసీబీ వలకు చిక్కారు. ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు అనుకూలంగా వ్యవహరించేందుకు రూ. 2 లక్షల లంచం డిమాండ్ చేశారు. అయితే రూ. 2 లక్షల్లో భాగంగా రూ. 1 లక్ష ఇవ్వాలని స్వర్ణకుమారి కోరినట్లు బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. మొదటగా బాధితుడు రూ. లక్షను హెల్త్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ కు అందజేశాడు. ఆ తర్వాత ఆ నగదును డీఎంహెచ్ఓ డ్రైవర్ కృష్ణయ్యకు ఇచ్చినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆ డబ్బులను కారులో పెట్టేందుకు వెళ్తున్న సమయంలో కృష్ణయ్యను పట్టుకున్నారు. ఈ మేరకు ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. ఇక ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే దర్యాప్తులో వెలుగులోకి రానున్నట్లు తెలుస్తోంది.

## సచివాలయానికి నిలిచిన మంచినీటి సరఫరా!?

**హైదరాబాద్, అక్టోబర్ 05(ప్రజావినికిడి):** తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి మంచినీటి సరఫరా నిలిచిపోయిందంటూ కొన్ని వార్తా ఛానళ్లలో ప్రసారమైన కథనాలపై హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (జలమండలి) స్పందించింది. సచివాలయానికి జలమండలి నుంచి అందించే మంచినీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయానికి మంచినీటి సరఫరా నిలిచిపోయిందన్న సమాచారం వెలువడిన వెంటనే జలమండలి అధికారులు స్పందించారు. ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి సచివాలయంలోని మంచినీటి సంపును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీల్లో సంపులో నీటిమట్టం పూర్తిస్థాయిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో సచివాలయానికి నీటి సరఫరా నిలిచిపోయిందన్న వార్తల్లో వాస్తవం లేదని జలమండలి స్పష్టం చేసింది. జలమండలి నుంచి సచివాలయానికి రోజువారీగా అందించే మంచినీటి సరఫరా యథావిధిగా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఎలాంటి సాంకేతిక సమస్య, సరఫరా అంతరాయం లేదని పేర్కొన్నారు. సచివాలయంలోని నీటి సంపును ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ఈ విషయాన్ని స్పష్టం చేసినట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి వెల్లడించారు. అధికారుల క్షేత్రస్థాయి పరిశీలనలో నీటి నిల్వలు సాధారణ స్థాయిలోనే ఉన్నట్లు తేలడంతో సచివాలయానికి నీటి సరఫరాపై వస్తున్న అనుమానాలకు జలమండలి తెరదించింది. ప్రజలు, సిబ్బంది ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు.

# రక్షణ, ఏవియేషన్‌లోనూ ‘టెంపుల్’!

**హెల్త్ ట్రాకింగ్‌ను దాటి ఏవియేషన్, రక్షణ రంగాల్లోకి జొమాటో ‘టెంపుల్’**

**పైలట్ల ఫిట్‌నెస్, సైనికుల సామర్థ్యం అంచనాకు ఈ డివైజ్ ఉపయోగం**

**భవిష్యత్తులో ఆలోచనలను టెక్స్ట్‌గా మార్చే టెక్నాలజీపై పరిశోధన**

**ప్రస్తుతం మెదడుకు రక్తప్రసరణను ట్రాక్ చేసే ‘బ్రెయిన్‌ఫ్లో’ ఫీచర్‌పై దృష్టి**



**అక్టోబర్ 5 (ప్రజావినికిడి):**
ప్రముఖ ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ ‘జొమాటో’ త్వరలో ‘టెంపుల్’ పేరుతో సరికొత్త వేరబుల్ డివైజ్‌ను మార్కెట్‌లోకి తీసుకురానుంది. ఈ పరికరం కేవలం ఆరోగ్య పర్యవేక్షణకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో విమానయాన, రక్షణ వంటి కీలక రంగాల్లో ఉపయోగపడే అపారమైన అనువర్తనాలను కలిగి ఉందని జొమాటో వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ వెల్లడించారు. అత్యంత క్లిష్టమైన విధుల్లో నిమగ్నమయ్యే వ్యక్తుల శారీరక దృఢత్వాన్ని అంచనా వేయడానికి ఈ డివైజ్ ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ వేదికగా నెటిజన్లతో సంభాషిస్తూ గోయల్ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. విమానం నడపడానికి పైలట్లు ఎంతవరకు ఫిట్‌గా ఉన్నారు? నిర్దిష్ట సైనిక చర్యలకు ఏ జవాను అత్యంత సమర్థుడు? వంటి విషయాలను గుర్తించడానికి ఈ పరికరం ఎంతగానో దోహదపడుతుందని ఆయన వివరించారు. రెస్టారెంట్ల సిబ్బంది ఎదుర్కొనే ఒత్తిడిని పర్యవేక్షించవచ్చన్న ఒక యూజర్ చేసిన సూచనకు స్పందిస్తూ గోయల్ ఈ వివరణ ఇచ్చారు.
మానవ ఆలోచనలను అక్షర రూపంలోకి మార్చగల వినూత్న సాంకేతికతపై తమ పరిశోధక బృందం పనిచేస్తోందని గోయల్ వెల్లడించడం విశేషం. అయితే, ఈ టెక్నాలజీ అందుబాటులోకి రావడానికి మరికొన్నేళ్లు పట్టవచ్చని, బహుశా ‘టెంపుల్’ మూడవ లేదా నాలుగవ వెర్షన్‌లో ఇది సాధ్యం కావచ్చని ఆయన అంచనా వేశారు.ప్రస్తుతానికి ఈ డివైజ్ ప్రధానంగా ఫిజికల్ బాడీ సెన్సింగ్, ఆరోగ్య పర్యవేక్షణపైనే దృష్టి సారించింది. ముఖ్యంగా మెదడుకు జరిగే రక్తప్రసరణలో మార్పులను నిరంతరం ట్రాక్ చేసే ‘బ్రెయిన్‌ఫ్లో’ ఫీచర్ ఇందులో కీలక పాత్ర పోషించనుంది. ఇటీవల 60 మందిపై నిర్వహించిన అధ్యయనంలో ఈ టెక్నాలజీ అత్యంత కచ్చితత్వంతో పనిచేస్తున్నట్లు నిరూపితమైందని గోయల్ పేర్కొన్నారు.

# పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఇంద్రకీలాద్రిపై ప్రధాని మోదీ పేరిట పూజలు



**అక్టోబర్ 5(ప్రజావినికిడి):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రధాని మోదీ పేరిట ఈ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ ఈ పూజలను నిర్వహిస్తున్నారు.2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రజా ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 25 ఏళ్లుగా తన సేవలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని, ప్రధాని మోదీకి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు జరపనున్నారు. దేశాన్ని ‘వికసిత్ భారత్’ లక్ష్యం వైపు నడిపిస్తున్న ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలన్నది ఈ పూజల ముఖ్య ఉద్దేశం.ఈ సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి అంతరాలయంలో అత్యంత విశిష్టమైన ‘ఖడ్గమాల అర్చన’ను ప్రధాని పేరిట జరపనున్నారు. జగద్గురువు ఆది శంకరాచార్యులు ఇంద్రకీలాద్రిపై ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి ఖడ్గమాల స్తోత్రంతో పూజలు నిర్వహిస్తే అమ్మవారి అనుగ్రహంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, రక్షణ, శాంతి, సంకల్పసిద్ధి కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.ప్రధాని మోదీ నిరంతర దేశ సేవకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత సుసంపన్నమైన, ఆత్మనిర్భర దేశంగా ఎదగాలన్న సంకల్పంతో ఎంపీ లింగమనేని రమేశ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజల ద్వారా ప్రధానికి సంపూర్ణ ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు లభించాలని ఆకాంక్షించారు.

# సంజయ్ దత్ వ్యాఖ్యలపై రాజకీయ దుమారం..

**అండగా నిలిచిన కాంగ్రెస్**

**దేశంలో మునుపటి శాంతి కనిపించడం లేదన్న సంజయ్ దత్**

**సంజయ్ వ్యాఖ్యలకు మద్దతు తెలిపిన కాంగ్రెస్**

**బీజేపీ పాలనలో ప్రజలకు భద్రత లేదని ఆరోపణ**

**తన వ్యాఖ్యలు సరదాగా చేసినవని సంజయ్ దత్ వివరణ**

**ఇక్కడ నచ్చని వారు వెళ్లిపోవచ్చన్న శివసేన నేత**



**అక్టోబర్ 5 (ప్రజావినికిడి):**
బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెను దుమారాన్ని రేపాయి. దేశంలో మునుపటిలా శాంతియుత వాతావరణం కనిపించడం లేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచింది. బీజేపీ ప్రభుత్వాల హయాంలో ప్రజలకు భద్రత కరవైందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. అయితే, తన వ్యాఖ్యలు కేవలం సరదా సంభాషణలో భాగమని సంజయ్ దత్ తర్వాత వివరణ ఇచ్చారు.
కాంగ్రెస్ నేత నానా పటోలే మాట్లాడుతూ, సంజయ్ దత్ “నికార్సయిన నిజం“ పలికారన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో పట్టపగలే హత్యలు జరుగుతున్నాయని, ప్రజలు అభద్రతాభావంతో ఉన్నారని ఆరోపించారు. ప్రజల ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని ఆయన సూచించారు. మరో కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ కూడా సంజయ్ దత్‌కు మద్దతిచ్చారు. ఒత్తిడి కారణంగానే ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారని, ఆయన మాటలు హృదయాంతరాల నుంచి వచ్చాయని అన్నారు.
అయితే, శివసేన (యూబీటీ) అధికార ప్రతినిధి ఆనంద్ దూబే భిన్నంగా స్పందించారు. సంజయ్ దత్ వ్యాఖ్యలను ఆయన మాట్లాడిన సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవాలన్నారు. దేశం శాంతియుతంగానే ఉందని, ఉజ్వల భవిష్యత్తు వైపు సాగుతోందని తెలిపారు. “ఇక్కడ ఏదైనా తప్పుగా అనిపించిన వారు, వేరే చోటికి వెళ్లిపోవచ్చు“ అని ఆయన వ్యాఖ్యానించారు.
ఈ వివాదంపై సంజయ్ దత్ ఆదివారం స్పష్టత ఇచ్చారు. శేఖర్ సుమన్ టాక్ షోలో తాను చేసిన వ్యాఖ్యలు సరదా సంభాషణలో భాగమని, ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ‘గాంధీగిరి‘ స్ఫూర్తితో ప్రేమ, ఐక్యతను ప్రోత్సహించే ఉద్దేశంతోనే ఆ వ్యాఖ్యలు చేసినట్లు వివరించారు. గాంధీ జయంతి సందర్భంగా జరిగిన ఈ షోలో, “దేశంలో మునుపటి శాంతి కనిపించడం లేదు. ఆ మంచి రోజులు మళ్లీ రావాలని శివుడిని ప్రార్థిస్తున్నా“ అని సంజయ్ దత్ వ్యాఖ్యానించారు.

# మంత్రి లోకేశ్ ను కలిసిన ఆసియా క్రీడల స్వర్ణ విజేత ఆర్చర్ జ్యోతి సురేఖ



**అక్టోబర్ 5(ప్రజావినికిడి):**
అంతర్జాతీయ వేదికలపై పతకాల పంట పండిస్తూ దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్న ప్రఖ్యాత ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ సోమవారం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయింది. ఇటీవల జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్-2026లో స్వర్ణ పతకం సాధించిన ఆమెను మంత్రి లోకేశ్ ఘనంగా అభినందించారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశిస్తూ, 2028 ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని, ఇందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.సోమవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఈ భేటీ జరిగింది. తన తండ్రి సురేంద్ర కుమార్‌తో కలిసి జ్యోతి సురేఖ, మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా, జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్-2026 ఆర్చరీ కాంపౌండ్ మహిళల టీమ్ విభాగంలో స్వర్ణం గెలుచుకున్న జ్యోతి సురేఖను మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించడం గర్వంగా ఉందని కొనియాడారు.ఏషియన్ గేమ్స్ చరిత్రలో జ్యోతి సురేఖ ఇప్పటివరకు నాలుగు స్వర్ణ పతకాలతో సహా మొత్తం ఆరు పతకాలు సాధించి అరుదైన రికార్డు సృష్టించింది. ఆమె నిలకడైన ప్రతిభ, పట్టుదల యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని లోకేశ్ అన్నారు. ఈ ప్రయాణంలో ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు.

# పార్టీ కాదు.. ప్రాంతం కాదు.. ప్రజలే ముఖ్యం

**తాగు నీటి విషయంలో రాజకీయాలకు తావు లేదు**

**ప్రతి ఇంటికీ సురక్షిత నీరు.. ప్రతి గ్రామానికి నీటి భద్రతే అమరజీవి జలధార లక్ష్యం**

**- రూ.30,156 కోట్లతో ‘అమరజీవి జలధార’కు శ్రీకారం**

**- -పులివెందులకు రూ.280 కోట్లుతో 299 గ్రామాల తాగు నీటి సమస్యకు పరిష్కారం**

**3.27 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందించేలా భారీ ప్రణాళిక**

**గత ఏడు దశాబ్దాల్లో నిర్మించిన వసతులకు మించి ఈ ఐదేళ్లలోనే భారీ నీటి మౌలిక వసతులు**

**రాయలసీమ నుంచి ఉద్దానం వరకు ప్రతి ప్రాంతానికీ సురక్షిత తాగునీరు**

**ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్ అమరజీవి జలధార ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

**అక్టోబర్ 5 (ప్రజావినికిడి):**
తాగు నీటి విషయంలో రాజకీయాలకు తావు లేదని, అభివృద్ధి విషయంలో ప్రాంతం, పార్టీ అనే తేడా లేకుండా ప్రజలందరికీ సమాన ప్రాధాన్యత ఇవ్వడమే కూటమి ప్రభుత్వ విధానమని ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు అన్నారు. ప్రజలు ఏ ప్రాంతానికి చెందిన వారైనా, ఏ పార్టీకి మద్దతు ఇచ్చినా వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగు నీరు, ప్రతి గ్రామానికి నీటి భద్రత కల్పించడమే ‘అమరజీవి జలధార’ లక్ష్యమని తెలిపారు. సోమవారం కడప జిల్లా ప్రొద్దుటూరులో నిర్వహించిన జల్ జీవన్ మిషన్ అమరజీవి జలధార ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారితో కలిసి రూ.30,156 కోట్ల విలువైన తాగునీటి పనులకు శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ “శ్రీరామచంద్రుని పాదస్పర్శతో పునీతమైన నేల. మహాత్మా గాంధీ నడయాడిన నేల. తెలుగు సాహిత్యాన్ని తన అక్షరాలతో సుసంపన్నం చేసిన సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులకు జన్మనిచ్చిన నేల ప్రొద్దుటూరు. బంగారం, వస్త్ర వ్యాపారంలో మినీ ముంబై గా, దసరా ఉత్సవాల్లో రెండో మైసూరు గా ప్రొద్దుటూరుకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

**రూ.30,156 కోట్లతో భారీ తాగు నీటి ప్రణాళిక**

రాష్ట్రంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో రూ.30,156 కోట్లతో 50,315 పనులను శ్రీకారం చుడుతున్నాం. 24,601 ఆవాసాల్లో ఇప్పటికే ఉన్న 61.60 లక్షల కుళాయి కనెక్షన్ల సామర్థ్యాన్ని పెంచి స్థిరీకరించడంతో పాటు, మరో 27.36 లక్షల కొత్త కుళాయి కనెక్షన్లను అందిస్తున్నాం. మొత్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగు నీరు అందేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నాం. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రారంభించిన ‘హర్ ఘర్ జల్’ జల్ జీవన్ మిషన్‌కు గత ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. 2019-24 మధ్య కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు దాదాపు రూ.26 వేల కోట్లు అందించినప్పటికీ, గత ఐదేళ్లలో రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి, అక్కడక్కడ పైపులైన్లు, చిన్నచిన్న పనులు చేసి వదిలేశారు. 2024తో పథకం గడువు ముగుస్తుందని, నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి వస్తుందని, ప్రజల తాగునీటి కష్టాలు ఎప్పటికీ తీరవని తెలిసినా కూడా పట్టించుకోలేదు.



2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, జల్ జీవన్ మిషన్‌ను కొనసాగించేందుకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు, నేను - గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారిని కలిసి విజ్ఞప్తి చేశాము. అలాగే, గౌరవ కేంద్ర జలశక్తి మంత్రివర్యులు శ్రీ సి.ఆర్. పాటిల్ గారు, గౌరవ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు శ్రీమతి నిర్మలా సీతారామన్ గారి సహకారంతో జలజీవన్ మిషన్ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, వెంటనే పనులు ప్రారంభించాం. ఇప్పటికే రూ.4,500 కోట్ల విలువైన పనులు పూర్తి చేశాము.

**గత మౌలిక వసతులకు భారీగా అదనపు సామర్థ్యం**

1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 2024 వరకు రాష్ట్రంలో తాగు నీటి మౌలిక వసతుల అభివృద్ధి క్రమంగా జరిగింది. ఈ కాలంలో 816 ఎం.ఎల్.డి సామర్థ్యం కలిగిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, 1,072 ఓవర్ హెడ్ బ్యాలెన్స్ జలాశయాలు, 28,086 ఓవర్ హెడ్ నిల్వ జలాశయాలు, 1.18 లక్షల కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు ఏర్పాటు చేయబడ్డాయి. అయితే, ‘అమరజీవి జలధార’ కార్యక్రమం ద్వారా కేవలం ఐదేళ్లలోనే ఈ మౌలిక వసతులకు భారీగా అదనపు సామర్థ్యాన్ని జోడిస్తున్నాం. ఇందులో భాగంగా 1,426 ఎం.ఎల్.డి సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి కేంద్రాలు, 494 ఓవర్ హెడ్ బ్యాలెన్స్ జలాశయాలు, 13,075 ఓవర్ హెడ్ నిల్వ జలాశయాలు, 77 వేల కిలోమీటర్ల పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నాం. అంటే, గత ఏడు దశాబ్దాల్లో నిర్మించిన మౌలిక వసతులతో పోలిస్తే, కేవలం ఈ ఐదేళ్లలోనే 50 శాతం నుంచి 175 శాతం వరకు అదనపు సామర్థ్యాన్ని సృష్టిస్తున్నాం. రూ.9 వేల కోట్లతో 50,283 సింగిల్ విలేజ్ స్కీమ్స్, రెట్రోఫిట్టింగ్ పనులు, రూ.19,500 కోట్లతో 32 మల్టీ విలేజ్ స్కీమ్స్ చేపడుతున్నాం. నీటి నాణ్యత పర్యవేక్షణ కోసం రూ.1,624 కోట్లు కేటాయించాము.

**తాళ్లమాపురానికి రూ.3.5 కోట్ల అభివృద్ధి పనులు**

ప్రొద్దుటూరు నియోజక వర్గంలోని తాళ్లమాపురం పంచాయతీ ప్రజలు గత ప్రభుత్వ హయాంలో తమ సమస్యల పరిష్కారం కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని స్థానికులు చెబుతున్నారు. దాదాపు 6 వేల జనాభా ఉన్న ఈ గ్రామంలో రోడ్లు, తాగు నీరు వంటి కనీస మౌలిక వసతుల కోసం ప్రజలు పలుమార్లు వినతులు సమర్పించినా, తగిన స్పందన లభించలేదనే ఆవేదన ఉంది. సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన యువత కూడా ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు ఉన్నాయి. ఇకపై ఇలాంటి పరిస్థితులకు తావులేకుండా తాళ్లమాపురం, సాగిలి గొడ్డుపల్లి, ములవారిపల్లి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. దాదాపు రూ.1.5 కోట్లతో రెండు కిలోమీటర్ల సీసీ రోడ్లు, మ్యాజిక్ డ్రైన్లు నిర్మించడంతో పాటు, మరో రూ.2 కోట్లతో 90 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ రిజర్వాయర్, నాలుగు కిలోమీటర్ల పైప్‌లైన్లు, ప్రత్యేక బోర్‌వెల్ ఏర్పాటు చేయనున్నాం. మొత్తం రూ.3.5 కోట్ల విలువైన ఈ పనులను తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశిస్తున్నాను. ప్రజల సమస్యలను పరిష్కరించే విషయంలో కూటమి ప్రభుత్వం ప్రాంతం, పార్టీ అనే తేడా చూడదు. ప్రతి గ్రామానికి సమానంగా అభివృద్ధి ఫలాలు అందాలన్నదే మా లక్ష్యం. అందుకు నిదర్శనంగా పులివెందులలో అసంపూర్తిగా ఉన్న తాగునీటి పథకానికి రూ.280 కోట్లు కేటాయించి, ఏడు మండలాల్లోని 299 గ్రామాల తాగు నీటి సమస్యకు పరిష్కారం చూపించే చర్యలు చేపట్టాం. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లోనూ ఎలాంటి ప్రాంతీయ భేదాలు లేకుండా దాదాపు రూ.2,500 కోట్లతో ‘పల్లె పండుగ’, ‘అడవితల్లి బాట’ వంటి అభివృద్ధి పనులను చేపడుతున్నాం.

**కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లుల చెల్లింపు**

గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ, జల జీవన్ మిషన్ వంటి కార్యక్రమాల కింద పనులు చేపట్టిన చిన్న, మధ్యతరహా కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎఫ్.ఐ.ఎఫ్.ఓ. విధానంలో బిల్లులను సకాలంలో చెల్లిస్తూ, కాంట్రాక్టర్లకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాం. అదే విధంగా 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా పంచాయతీలకు ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నాం. ఇప్పటి వరకు రూ.4,200 కోట్లను విడుదల చేశాం. పంచాయతీలకు నిధుల కొరత లేకుండా చూడటం, అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగించడం, పనులు చేసిన వారికి సకాలంలో చెల్లింపులు చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం” అన్నారు.

# మరో సిరీస్ నుంచి హార్దిక్ పాండ్యా అవుట్




ఆస్ట్రేలియా ఎ జట్టుతో పుదుచ్చేరి వేదికగా జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం భారత ఎ జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తాజా గాయం కారణంగా ఈ సిరీస్ మొత్తానికి దూరం అయ్యాడు. అతని స్థానంలో ముంబైకి చెందిన సూర్యాంశ్ షెడ్గె ఎంపికయ్యాడు. ఈ నెల 6, 9, 11 తేదీల్లో టీమిండియా ఏ-ఆస్ట్రేలియా ఏ జట్ల మధ్య ఈ మ్యాచ్ లు జరుగనున్నాయి. తన సత్తా నిరూపించుకోవడానికి షెడ్గెకు సువర్ణావకాశాన్ని లభించినట్టయింది. హార్దిక్ పాండ్యాను వరుస గాయాల బెడద వదలట్లేదు. బెంగళూరు నేషనల్ క్రికెట్ అకాడమీలో ఫిట్‌నెస్ టెస్ట్ సందర్భంగా అతని కుడి పిక్క భాగంలో తీవ్ర అసౌకర్యం తలెత్తింది. అనంతరం నిర్వహించిన ఎంఆర్ఐ స్కానింగ్‌లో అతనికి మైల్డ్ ఇంట్రామెడుల్లరీ ఎడెమా సమస్య ఉన్నట్లు డాక్టర్లు గుర్తించారు. ఫలితంగా.. రాబోయే న్యూజిలాండ్ పర్యటనకు సైతం అతను ఎంపిక కావడం అనుమానమే. ఈ సిరీస్ కంటే ముందే పూర్తి ఫిట్‌నెస్ సాధించి జాతీయ జట్టులోకి తిరిగి రావాలనే పాండ్యా సుదీర్ఘ నిరీక్షణకు మళ్లీ గట్టి ఎదురుదెబ్బ తగిలింది. హార్దిక్ పాండ్యాతో పాటు హర్షిత్ రాణా కూడా ఇప్పట్లో కోలుకోవడం కష్టంగానే కనిపిస్తోంది. గాయం కారణంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో రిహాబిలిటేషన్ లో ఉంటోన్నాడీ ఫాస్ట్ బౌలర్. దీనివల్ల ఇప్పటికే ఆఫ్ఘనిస్తాన్, వెస్టిండీస్ సిరీస్ లను చేజార్చుకోవాల్సి వచ్చింది. ఆసియా గేమ్స్ కూ దూరం అయ్యాడు. ప్రస్తుతం అతని ఫిట్ నెస్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే న్యూజిలాండ్ పర్యటనకు కూడా అందుబాటులో ఉండకపోవచ్చని చెబుతున్నారు.అటు షెడ్గె కూడా కొంతకాలం పాటు గాయాలతో సతమతం అయ్యాడు. కండరాల నొప్పితో ఇబ్బంది పడ్డాడు. దేశవాళీ టోర్నీలకు దూరం అయ్యాడు. బెంగళూరులో బీసీసీఐకి చెందిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో రిహాబిలిటేషన్ లో గడిపాడు. తాజాగా అతను పూర్తి ఫిట్ నెస్ సాధించడంతో బీసీసీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తుది పరీక్షల అనంతరం పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు నిర్ధారణ కావడంతో నేరుగా పుదుచ్చేరిలో ఉన్న భారత-ఎ తో చేరాడు. ఈ ఏడాది ఐర్లాండ్, ఇంగ్లాండ్, జింబాబ్వే పర్యటనల్లో భారత్ తరఫున మూడు అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడాడు సూర్యాంశ్. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై చాంపియన్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. శ్రీలంకలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లోనూ భారత్ 'ఎ' తరఫున అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడీ ఆల్ రౌండర్. అక్కడ మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి అయిదు మ్యాచ్‌ల్లో 147 పరుగులు చేశాడు. హార్దిక్ పాండ్యా తరహాలోనే బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ రాణించే సత్తా అతనికి ఉంది.

# ప్రయోగాలు చేయడానికి ఎక్కువ సమయం లేదు



**• వరల్డ్ కప్ టీమ్ పై తేల్చేసిన శుబ్ మాన్ గిల్..!**

వచ్చే ఏడాది భారత్ వేదికగా జరిగే వన్డే క్రికెట్ వరల్డ్ కప్ పై టీమిండియా కెప్టెన్ శుభ్ మన్ గిల్ కీలక వ్యాఖ్యలు చేశాడు. నిన్న వెస్టిండీస్ తో జరిగిన మూడో వన్డేలో భారత్ ఓటమి పాలైన నేపథ్యంలో గిల్.. వచ్చే వరల్డ్ కప్ లో జట్టు కూర్పుపై ఈ వ్యాఖ్యలు చేశాడు. వరల్డ్ కప్ కోసం టీమ్ లో ప్రయోగాలు చేయడానికి ఎక్కువ సమయం లేదని, త్వరగా కుదురుకోవాల్సి ఉందని జట్టులో ఆటగాళ్లను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. వెస్టిండీస్ తో తొలి రెండు వన్డేలు ఆడిన జట్టులో పలు మార్పులు చేసి మూడో వన్డేలో బరిలోకి దిగి జట్టు ఓటమి పాలైన నేపథ్యంలో గిల్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యంగా తర్వాతి సిరీస్ నుండే ప్రపంచ కప్‌లో ఆడబోయే జట్టు కూర్పుతో బరిలోకి దిగాలని గిల్ భావిస్తున్నాడు. డిసెంబర్ 2019 తర్వాత స్వదేశంలో వెస్టిండీస్ చేతిలో భారత్ తన మొదటి వన్డే ఓటమిని చవిచూడటంతో ఇకపై ప్రయోగాల జోలికి వెళ్లకుండా వరల్డ్ కప్ ఆడే జట్టుతోనే బరిలోకి దిగాలని గిల్ ప్లాన్ చేస్తున్నాడు. వెస్టిండీస్ తో తొలి రెండు వన్డేలు ఆడిన జట్టులో పలు మార్పులు చేసి మూడో వన్డేలో బరిలోకి దిగి జట్టు ఓటమి పాలైన నేపథ్యంలో గిల్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యంగా తర్వాతి సిరీస్ నుండే ప్రపంచ కప్‌లో ఆడబోయే జట్టు కూర్పుతో బరిలోకి దిగాలని గిల్ భావిస్తున్నాడు. డిసెంబర్ 2019 తర్వాత స్వదేశంలో వెస్టిండీస్ చేతిలో భారత్ తన మొదటి వన్డే ఓటమిని చవిచూడటంతో ఇకపై ప్రయోగాల జోలికి వెళ్లకుండా వరల్డ్ కప్ ఆడే జట్టుతోనే బరిలోకి దిగాలని గిల్ ప్లాన్ చేస్తున్నాడు. విండీస్ తో సిరీస్ గెల్చుకున్నా, మూడో వన్డేలో ఓటమి తర్వాత గిల్ కీలక వ్యాఖ్యలు చేశాడు. నిజాయితీగా చెప్పాలంటే, ప్రయోగాలు చేయడానికి అంత సమయం లేదన్నాడు. తాము ఆడాలనుకుంటున్న జట్టు కూర్పుతోనే బరిలోకి దిగాలని అనుకుంటున్నట్లు వెల్లడించాడు. తదుపరి సిరీస్ నాటికి తమకు కావాల్సిన ఆటగాళ్లందరూ అందుబాటులోకి వస్తారని ఆశిస్తున్నానని గిల్ తెలిపాడు. ప్రపంచ కప్‌లో తాము ఏ కూర్పుతో ఆడాలనుకుంటున్నామో, ఆ కూర్పుతోనే ఆడటం ప్రారంభించాలనుకుంటున్నామని తేల్చిచెప్పేశాడు. వాస్తవానికి విండీస్ తో సిరీస్ జరుగుతున్న సమయంలోనే 2026 ఆసియా క్రీడలు కూడా జరగడంతో, ఆ జట్టులో సభ్యుడిగా ఉన్న టీమిండియా ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. అలాగే గాయం కారణంగా హార్దిక్ పాండ్యా కూడా జట్టుకు అందుబాటులో లేడు. వివిధ కారణాల వల్ల ఆటగాళ్లు జట్టుకు దూరమవ్వడం నిరాశ కలిగించే విషయమని గిల్ అభిప్రాయపడ్డాడు. దీంతో రాబోయే సిరీస్ లకు బుమ్రా, హార్దిక్ లను జట్టులోకి తీసుకుని ఆడించేందుకు గిల్ సిద్ధమవుతున్నాడు.

# భారత కెప్టెన్‌గా భువనేశ్వర్ కుమార్

**• హాంకాంగ్ సిక్సెస్ టోర్నీకి సిద్ధమైన టీమిండియా**




హాంకాంగ్ సిక్సెస్ టోర్నీ ఆడేందుకు టీమిండియా సిద్ధమైంది. భువనేశ్వర్ కుమార్ సారథ్యంలోని భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. భువనేశ్వర్ కుమార్‌తో పాటు కృనాల్ పాండ్యా, నితీష్ రాణా, శశాంక్ సింగ్, టీ నటరాజన్, రాహుల్ తెవాటియా, రాహుల్ త్రిపాఠి ఈ జట్టులో ఉన్నారు. న్యూజిలాండ్‌తో 2022లో చివరి టీ20 మ్యాచ్ ఆడిన భువనేశ్వర్ కుమార్.. మళ్లీ భారత్ తరఫున ఆడలేదు. ఇన్నాళ్లకు ఐసీసీ ఆమోదం ఉన్న హాంకాంగ్ సిక్సెస్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు ఈ టోర్నీ జరగనుంది.ఐసీసీ ఆమోదంతో క్రికెట్ హాంగ్ కాంగ్ ప్రతీ ఏడాది ఈ భిన్నమైన టోర్నీని నిర్వహిస్తుంది. ఈ టోర్నీ ఫార్మాట్, నిబంధనలు.. ఐసీసీ రూల్స్‌కు భిన్నంగా ఉంటాయి. ఈ టోర్నీలో ప్రతీ జట్టులో ఆరుగురు ఆటగాళ్లు మాత్రమే ఉంటారు. బౌలర్, కీపర్ మినహాయించి మైదానంలో నలుగురు ఫీల్డర్లు మాత్రమే ఉంటారు. దాంతో బ్యాటర్లకు పరుగులు చేయడం సులువవుతోంది. ప్రతీ మ్యాచ్ 6 ఓవర్ల చొప్పున జరుగుతుంది. ఒక మ్యాచ్ సగటున 45 నిమిషాల్లోనే పూర్తవుతుంది. వికెట్ కీపర్ మినహా జట్టులోని ఐదుగురు ఆటగాళ్లు తప్పనిసరిగా బౌలింగ్ చేయాలి. ఒక బౌలర్ గరిష్టంగా 2 ఓవర్లు వేయవచ్చు. కానీ వరుసగా వేయడానికి లేదు. మిగిలిన నలుగురు ఆటగాళ్లు తప్పనిసరిగా ఒక్కో ఓవర్ వేయాలి. ఈ ఫార్మాట్ ఆల్‌రౌండర్లకు బాగా కలిసొస్తుంది. ఏ బ్యాటర్ అయినా వ్యక్తిగతంగా 50 పరుగులు పూర్తి చేయగానే నాటౌట్‌గా రిటైర్ కావాలి. ఒకవేళ జట్టులోని 5 వికెట్లు పడిపోతే, నాటౌట్‌గా మిగిలిన చివరి బ్యాటర్ ఒంటరిగానే బ్యాటింగ్ కొనసాగించవచ్చు. అయితే అతనితో పాటు రన్నింగ్ చేయడానికి నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఒక రన్నర్ (ఔటైన ఆటగాడు) ఉంటాడు.జట్టు ఇన్నింగ్స్ ముగిసే సమయానికి ఓవర్లు మిగిలి ఉండి, చివరి వికెట్ పడిపోతే, అంతకుముందు 50 పరుగులు చేసి రిటైర్ అయిన బ్యాటర్ మళ్లీ క్రీజ్‌లోకి రావచ్చు. ప్రతి వైడ్ లేదా నో బాల్‌కి ప్రత్యర్థి జట్టుకు 2 పరుగులు అదనంగా ఇస్తారు. సాధారణంగా ఫైనల్ మ్యాచుల్లో మాత్రమే 5 ఓవర్లకు బదులుగా 8 ఓవర్లు లేదా ప్రత్యేక వైవిధ్యమైన రూల్స్ ఉపయోగిస్తుంటారు. ఈ టోర్నీలో భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌తో సహా మొత్తం 12 జట్లు పోటీపడుతాయి. ఈ 12 జట్లను 4 గ్రూప్‌లుగా ,ాశీశీశ్రీ-ూ, దీ, జ, ఱ విభజించారు. గ్రూప్ దశలో టాప్ స్థానాల్లో నిలిచే జట్లు నాకౌట్‌కు అర్హత సాధిస్తాయి.హాంకాంగ్ సిక్స్ సిరీస్ కోసం భారత జట్టు: భువనేశ్వర్ కుమార్, కృనాల్ పాండ్యా, శశాంక్ సింగ్, రాహుల్ ద్వివేది, నితీష్ రాణా, రాహుల్ త్రిపాఠి, డి నటరాజన్.

# వైభవ్‌ను స్టార్‌గా తీర్చిదిద్దుతున్న టీమిండియా



టీమిండియాలోకి వచ్చిన యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీని పెద్ద ఆటగాడిగా తీర్చిదిద్దేందుకు జట్టు మేనేజ్‌మెంట్ ప్రత్యేక దృష్టి పెడుతోంది. సీనియర్ ఆటగాళ్ల మధ్య ఉండటం, వాళ్లను గమనించడం, ప్రశ్నలు అడగడం ద్వారా 15 ఏళ్ల వైభవ్ ఎంతో నేర్చుకోగలడని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చెప్పాడు. వెస్టిండీస్‌తో మంగళవారం ప్రారంభమయ్యే ఐదు టీ20ల సిరీస్‌కు ముందు అతను ఈ వ్యాఖ్యలు చేశారు. వైభవ్‌కు తుది జట్టులో అవకాశం వచ్చినా.. రాకపోయినా అతడి ఎదుగుదల ఆగదని మోర్కెల్ అన్నారు. మ్యాచ్ ఆడకపోయినా డ్రెస్సింగ్ రూమ్‌లో సీనియర్ ఆటగాళ్లతో గడపడం, వాళ్లు ప్రాక్టీస్‌కు ఎలా సిద్ధమవుతున్నారు? ఇన్నింగ్స్‌ను ఎలా ప్లాన్ చేస్తున్నారు? పరిస్థితులకు తగ్గట్టుగా ఎలా స్పందిస్తున్నారు? అన్నది గమనించడం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. "ప్రాక్టీస్‌లో ఈ ఆటగాడు ఏం చేస్తున్నాడో చూడు. అతడు తొలి 15 బంతులను ఎలా ఎదుర్కొంటున్నాడు? పిచ్ నుంచి సహకారం లభిస్తే ఎలా ప్లాన్ చేస్తున్నాడు? అని యువ ఆటగాళ్లను ఆలోచించేలా చేస్తాను" అని మోర్కెల్ తెలిపాడు. ప్రతి ప్రాక్టీస్ సెషన్ తర్వాత వైభవ్ ఏం నేర్చుకున్నాడో అడుగుతానని చెప్పాడు. "నేను ఫాస్ట్ బౌలర్‌ను. బ్యాటింగ్ గురించి ఎక్కువగా చెప్పలేను. కానీ బస్సులో అతడిని 'ఈ రోజు ఏం నేర్చుకున్నావు? ఆ ఆటగాడి బ్యాటింగ్‌లో ఏం గమనించావు?' అని అడుగుతాను. ఇలా అడగడం వల్ల అతడు ఆలోచిస్తాడు. తర్వాత నెట్స్‌లోకి వచ్చినప్పుడు ఆ విషయాలను గమనించి తన ఆటకు తగ్గట్టుగా మార్చుకుంటాడు" అని వివరించాడు. ఇక భారత్-వెస్టిండీస్ టీ20 సిరీస్ తొలి మ్యాచ్ లక్నోలోని ఏకానా స్టేడియంలో జరగనుంది. ఆసియా క్రీడల నుంచి తిరిగొచ్చిన ఆటగాళ్ల ఫిట్‌నెస్, ప్రయాణ అలసటను పరిశీలించిన తర్వాత తుది జట్టును ఎంపిక చేస్తామని మోర్కెల్ తెలిపాడు. గాయంతో కొంతకాలం దూరమైన మయాంక్ యాదవ్ తిరిగి జట్టులోకి రావడం కూడా భారత్‌కు కీలకమేనన్నారు. అతడి వేగం ప్రత్యేక ఆయుధమని చెప్పాడు. నెట్ బౌలర్‌గా మొదలై ఇప్పుడు భారత్ తరఫున ఆడే స్థాయికి చేరుకున్న ప్రిన్స్ యాదవ్ కష్టపడిన తీరును మోర్కెల్ ప్రశంసించాడు.

# మహారాష్ట్ర జట్టు కెప్టెన్‌గా పృథ్వీ షా!




టీమిండియా వెటరన్ ఓపెనర్ పృథ్వీ షాకు సారథ్య బాధ్యతలు దక్కాయి. ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీ 2026లో అతను మహారాష్ట్ర జట్టును నడిపించనున్నాడు. ఈ టోర్నీ తొలి మ్యాచ్ కోసం మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ తమ జట్టును ప్రకటించింది. రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్.. జట్టుకు దూరమవడంతో తొలి మ్యాచ్‌కు పృథ్వీ షాను కెప్టెన్‌గా ఎంపిక చేశారు.రుతురాజ్ గైక్వాడ్ భారత్-ఏ సారథిగా.. పుదెచ్చరి వేదికగా ఆస్ట్రేలియా-ఏతో మూడు అనధికారిక వన్డేలు ఆడనున్నాడు. ఈ వన్డే సిరీస్ అక్టోబర్ 6, 9, 11 తేదీల్లో జరగనుంది. మహారాష్ట్ర ఆల్‌రౌండర్ అర్షిన్ కురకర్ణి కూడా భారత్- ఏ జట్టులోనే భాగం కావడంతో తొలి మ్యాచ్‌కు దూరమయ్యాడు. అక్టోబర్ 11 నుంచి రంజీ ట్రోఫీ 2026-27 సీజన్ ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. గత సీజన్‌కు ముందు పృథ్వీ షా మహారాష్ట్ర జట్టులో చేరిన సంగతి తెలిసిందే. ఆ సీజన్‌లో పృథ్వీ షా 537 పరుగులు చేసి మహారాష్ట్ర తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కెప్టెన్‌గా పృథ్వీ షాకు మంచి రికార్డ్ ఉంది. అతని సారథ్యంలో భారత జట్టు 2018 అండర్ 19 ప్రపంచకప్ గెలిచింది. అంతేకాకుండా ముంబై జట్టును విజయ్ హాజారే ట్రోఫీ విజేతగా నిలవడమే కాకుండా.. 2021-22 రంజీ ట్రోఫీ సీజన్‌లో ఫైనల్ వరకు తీసుకెళ్లాడు. ఈ రంజీ సీజన్‌లో మహారాష్ట్ర తన తొలి మ్యాచ్‌ను సర్వీసెస్ జట్టుతో అక్టోబర్ 11 నుంచి ఆడనుంది. పృథ్వీ షా(కెప్టెన్), సచిన్ దాస్, దిగ్విజయ్ పాటిల్, అంకిత్ బవానే, హర్షల్ కేట్, సిద్దేష్ వీర్, సౌరభ్ నవలే(కీపర్), విక్కీ ఓస్త్వాల్, రాజ్‌వర్ధన్ హంగర్గేకర్, ముఖేష్ చౌదరి, ప్రదీప్ దాధే, తనయ్ సంఘ్వీ, వైభవ్ దార్కుండే, హితేష్ వాలుంజ్, రిషికేష్ సోనావానే, అథర్వ ధర్మాదికారి. నటి ఆకృతి అగర్వాల్‌తో జరగాల్సిన పృథ్వీ షా పెళ్లి రద్దయిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మార్చిలో ఈ ఇద్దరికి నిశ్చితార్థం జరగగా.. పెళ్లి పీటలెక్కక ముందే వీరి బంధం ముగిసింది. తమ లక్ష్యాలు భిన్నంగా ఉండటంతో విడిపోవాలని నిర్ణయించుకున్నామని ఆకృతి అగర్వాల్ తన ఇన్‌స్టా పోస్ట్‌లో రాసుకొచ్చింది. పృథ్వీ షా మాత్రం ఇప్పటి వరకు స్పందించలేదు.

# వినూ మంకడ్ ట్రోఫీలో ఆడనున్న ఆర్యవీర్ సెహ్వాగ్



టీమిండియా మాజీ విధ్వంసకర ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తన ధనాధన్ బ్యాటింగ్ తో భారత క్రికెట్ చరిత్రలో ప్రత్యేక ముద్ర వేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన వారసుడు ఆర్యవీర్ సెహ్వాగ్ కూడా తండ్రి బాటలోనే వేగంగా దూసుకొస్తున్నాడు. 18 ఏళ్ల ఈ యువ బ్యాటర్‌కు ఢిల్లీ క్రికెట్లో అరుదైన అవకాశం దక్కింది. రాబోయే ప్రతిష్టాత్మక వినూ మంకడ్ ట్రోఫీ కోసం ఆర్యవీర్ సెహ్వాగ్‌ను ఢిల్లీ అండర్-19 జట్టు కెప్టెన్‌గా నియమిస్తూ కీలక బాధ్యతలు అప్పగించారు. ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ వినూ మంకడ్ ట్రోఫీ కోసం 16 మంది సభ్యులతో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించింది. విశాఖపట్నం వేదికగా అక్టోబర్ 8 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో ఢిల్లీ జట్టును ఆర్యవీర్ ముందుకు నడిపించనున్నాడు. ఓ ప్రధాన జట్టుకు నాయకత్వం వహించడం ఆర్యవీర్‌కు ఇదే తొలిసారి కావడంతో ఈ నిర్ణయం ఆసక్తికరంగా మారింది. జట్టుకు అర్నవ్ బుగ్గా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.గత కొన్ని నెలలుగా ఆర్యవీర్ సెహ్వాగ్ అద్భుతమైన ఫామ్‌ను కనబరుస్తున్నాడు. ఇటీవల రాజ్‌కోట్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన యూత్ వన్డే సిరీస్‌లో భారత అండర్-19 జట్టు తరఫున ఆడి తన సత్తా చాటాడు.

# డబ్ల్యూసీఎల్ నుంచి పాక్ జట్టు ఔట్!

పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌తో ఆడేందుకు నిరాకరించిన భారత మాజీ క్రికెటర్ల నిర్ణయంపై ఇప్పుడు మరోసారి చర్చ మొదలైంది. గత సీజన్‌లో పాక్‌తో మ్యాచ్ ఆడకుండా భారత్ తీసుకున్న నిర్ణయంపై క్షమాపణ చెప్పాలని పాకిస్థాన్ ఇప్పుడు డిమాండ్ చేసినట్లు సన్నిహిత వర్గాలను ఉటంకిస్తూ ఎన్‌డీటీవీ కథనం పేర్కొంది. ఎన్డీటీవీ కథనం ప్రకారం... ఈ డిమాండ్‌ను 'వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్' (డబ్ల్యూసీఎల్) నిర్వాహకులు తిరస్కరించడంతో పాకిస్థాన్ ఛాంపియన్స్ ప్రస్తుత టోర్నీ నుంచి వైదొలిగింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో.. భారత జట్టు పాక్‌తో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించింది. ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకొని తీసుకున్న ఈ నిర్ణయంలో భారత్ వెనక్కి తగ్గలేదు. దీంతో గత సీజన్‌లో ఇరు జట్ల మధ్య జరగాల్సిన గ్రూప్ మ్యాచ్ రద్దయింది. సెమీఫైనల్లోనూ భారత్ ఇదే వైఖరిని కొనసాగించింది. పాక్‌తో ఆడేందుకు భారత ఆటగాళ్లు మైదానంలోకి దిగకపోవడంతో పాకిస్థాన్ వాకోవర్‌తో ఫైనల్‌కు చేరింది. భారత జట్టులో యువరాజ్ సింగ్, సురేశ్ రైనా, హర్భజన్ సింగ్, పీయూష్ చావ్లా, యూసుఫ్ పఠాన్, రాబిన్ ఉతప్ప వంటి మాజీ ఆటగాళ్లు ఉన్నారు. ఈసారి టోర్నీలో పాల్గొనేందుకు పాక్ ఆటగాళ్లకు పీసీబీ ఎన్‌ఓసీలు ఇచ్చేందుకు అంగీకరించింది. అయితే గత సీజన్‌లో తీసుకున్న నిర్ణయంపై భారత్ నుంచి లిఖితపూర్వక క్షమాపణ కోరింది. అంతేకాదు.. భారత ఆటగాళ్లు టోర్నీలో పాల్గొనకపోయినా అభ్యంతరం లేదని నిర్వాహకులు హామీ ఇవ్వాలని కూడా కోరింది. అయితే ఈ డిమాండ్లను డబ్ల్యూసీఎల్ నిర్వాహకులు అంగీకరించలేదు. దీంతో పాకిస్థాన్ ఛాంపియన్స్ టోర్నీ నుంచి తప్పుకుంది. దీనిపై డబ్ల్యూసీఎల్ మాత్రం 'అనుకోని పరిస్థితుల కారణంగా' పాక్ జట్టు వైదొలిగినట్లు ప్రకటించింది.

## మెగా క్రేజీ అప్‌డేట్.. చిరంజీవి 'కాకా'లో
# కీలకపాత్రలో అనురాగ్ కశ్యప్

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న కొత్త చిత్రం 'కాకా'లో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఈ సినిమాలో బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ ఓ అత్యంత కీలకమైన పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చేరికతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. తాజాగా అనురాగ్ కశ్యప్ కూడా షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ఆయనతో పాటు ఇతర ప్రధాన నటులపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. విలక్షణమైన, పవర్‌ఫుల్ పాత్రలకు పెట్టింది పేరైన అనురాగ్ కశ్యప్, మెగాస్టార్ చిరంజీవి మధ్య తెరపై వచ్చే ముఖాముఖి సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని అభిమానులు అంచనా వేస్తున్నారు. "ది వరల్డ్ ఆఫ్ కాకా జస్ట్ గాట్ డెడ్లియర్" అంటూ చిత్రబృందం చేసిన ప్రకటన ఈ అంచనాలకు మరింత బలం చేకూర్చింది.'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న 'కాకా' సినిమాపై మొదటి నుంచే భారీ ఆసక్తి నెలకొని ఉంది. ఇప్పటికే చిరంజీవి పుట్టినరోజున విడుదలైన 'కాకా' టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఇప్పుడు అనురాగ్ కశ్యప్ చేరికతో ఈ ప్రాజెక్ట్ మరింత క్రేజీగా మారింది. ఈ చిత్రంలో అనశ్వర రాజన్ కూడా నటిస్తుండగా, మరికొందరు ప్రముఖ నటీనటులు కూడా భాగం కానున్నారు.కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె నారాయణ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు స్పష్టం చేశారు.




# స్వీయదర్శకత్వంలో
# కిరణ్ అబ్బవరం 'రియాలిటీ'..



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం దర్శకుడిగా మారారు. తన తదుపరి చిత్రంతో నటుడిగా, దర్శకుడిగా ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. కొంతకాలంగా ఖూ13 అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమాకు 'రియాలిటీ' అనే ఆసక్తికరమైన పేరును ఖరారు చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం టైటిల్ గ్లింప్స్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది.

విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ సినిమా థీమ్‌ను తెలియజేస్తోంది. "చిన్న చిన్న ఆనందాలే... హై మూమెంట్స్" అనే ట్యాగ్‌లైన్‌తో పాటు "మన కథ. మన రియాలిటీ" అనే క్యాప్షన్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇది ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే సహజమైన కథతో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది.

జాయ్ ఫిల్మ్స్ పతాకంపై సుధాకర్ చాగంటి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కిరణ్ అబ్బవరం సరసన దేవికా భట్ హీరోయిన్‌గా నటిస్తోంది. శరత్ కుమార్, సాయికుమార్, రమేశ్ ఇందిర, అన్నపూర్ణమ్మ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్నారు. తనదైన శైలిలో యూత్‌ఫుల్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లతో గుర్తింపు తెచ్చుకున్న కిరణ్ అబ్బవరం, 'రియాలిటీ'తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకోవాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. క్రిస్మస్ విడుదలను లక్ష్యంగా పెట్టుకుని చిత్ర బృందం ముందుకు సాగుతోంది.



# ఆ దాడులకు నాకు సంబంధం లేదు..
## ఐటీ సోదాలపై రకుల్ ప్రీత్ సింగ్ ఫైర్!

తన పేరును ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ సోదాలతో ముడిపెడుతూ వస్తున్న వార్తలపై బాలీవుడ్ నటి రకుల్ ప్రీత్ సింగ్ తీవ్రంగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఆ సోదాలకు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా కొన్ని మీడియా సంస్థలు, ఆన్‌లైన్ రిపోర్టర్లు వార్తలను సంచలనం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు."కొందరు ఆన్‌లైన్ రిపోర్టర్లు, కొన్ని ప్రధాన మీడియా సంస్థల్లో వాస్తవాలను నిర్ధారించుకోకుండా వార్తలను సంచలనం చేసే ధోరణి పెరుగుతుండటం బాధాకరం. అందుకే ఒకేసారి అందరికీ స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. ఆ సోదాలు నాకు సంబంధించినవి కావు" అని రకుల్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

తన నేపథ్యం గురించి వివరిస్తూ.. "నేను ఆర్మీ కుటుంబం నుంచి వచ్చాను. ఇండస్ట్రీలో నాకు ఎలాంటి గాడ్‌ఫాదర్ లేరు. కేవలం నా కష్టంతోనే ఈ స్థాయికి వచ్చాను. చట్టాన్ని గౌరవించే పౌరురాలిగా 20 ఏళ్ల వయసు నుంచే క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నాను" అని ఆమె తెలిపారు.ఆర్థిక అవకతవకల ఆరోపణలను కూడా ఆమె ఖండించారు. "వ్యక్తిగతంగా గానీ, ఏ నిర్మాణ సంస్థ తరఫున గానీ నేను ఎలాంటి అక్రమ విదేశీ లావాదేవీలలో పాలుపంచుకోలేదు. దేశంలో లేదా విదేశాల్లో ఎవరి పేరు మీద కూడా నేను బినామీ ఆస్తులు కలిగి లేను. నాకు ఎవరూ ఎప్పుడూ ఎలాంటి ఆస్తులను బహుమతిగా ఇవ్వలేదు. అలాంటి ఖరీదైన బహుమతులు తీసుకోకూడదన్నది నా నియమం" అని రకుల్ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మీడియా తీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. "నా గురించి తప్పుడు, దురుద్దేశపూర్వక కథనాలు ప్రచురించిన వారందరూ వాటిని వెనక్కి తీసుకుని, వాస్తవాలను స్పష్టం చేయాలని కోరుతున్నాను. మీడియా వ్యాపారంలో ఎంత పెద్ద సంస్థకైనా ఆర్థిక ఒత్తిళ్లు ఉంటాయని నేను అర్థం చేసుకోగలను. కానీ అది వాస్తవాలను పణంగా పెట్టి జరగకూడదు. ఒకరి ప్రతిష్ఠ, జీవనోపాధిని దెబ్బతీసేలా అసలే ఉండకూడదు" అని ఆమె హితవు పలికారు.కాగా, ముంబైలో నటి రకుల్ ప్రీత్ సింగ్, ఆమె మామ, సినీ నిర్మాత వాషు భగ్నానీ, పనోరమా స్టూడియోస్‌కు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఆదాయపు పన్ను శాఖ సోదాలు నిర్వహించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఆర్థిక అవకతవకల ఆరోపణలపై ముంబై ఐటీ విభాగం సుమారు 12 ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. సినిమా ఫైనాన్సింగ్ పేరుతో నిధులను అక్రమంగా విదేశాలకు తరలించారన్న ఆరోపణలపై ఈ దర్యాప్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తనపై వచ్చిన వార్తలను రకుల్ ఖండించారు.

# డీప్‌ఫేక్ అకౌంట్లపై 'మా' సీరియస్..
## వివరాలు సేకరిస్తున్నామన్న మంచు విష్ణు




తెలుగు చిత్ర పరిశ్రమను లక్ష్యంగా చేసుకుని డీప్‌ఫేక్ వీడియోలు, నెగెటివిటీని వ్యాప్తి చేస్తున్న సోషల్ మీడియా ఖాతాలు, నెట్‌వర్క్‌ల వివరాలను సేకరిస్తున్నామని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు మంచు విష్ణు వెల్లడించారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమస్యపై శాశ్వత పరిష్కారం కోసం పరిశ్రమలోని కీలక విభాగాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఇటీవల వెలుగులోకి వచ్చిన ఏఐ డీప్‌ఫేక్ వీడియో ఘటనపై మంచు విష్ణు స్పందిస్తూ, దీనిని ఒకరిద్దరికి సంబంధించిన సమస్యగా కాకుండా, మొత్తం పరిశ్రమకు ఇది ఒక హెచ్చరికగా భావించాలని అన్నారు. హీరో రామ్ పోతినేని వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. "వారికి ముఖం లేదు, అందుకే భయం లేదు" అని, ఇలాంటి వారిని కట్టడి చేయాలంటే ఆన్‌లైన్ ఖాతాలకు ఆధార్‌తో అనుసంధానించే అంశంపై చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. దీని ద్వారా ఆన్‌లైన్‌లో జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన సూచించారు.కొందరు నటుల ఫొటోలతో ఫ్యాన్ పేజీల రూపంలో నకిలీ ఖాతాలు సృష్టించి, వాటి ద్వారా ద్వేషాన్ని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని విష్ణు విమర్శించారు. ఈ నెగెటివిటీలో కొంత పరిశ్రమలోపలి నుంచే వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఖాతాలు, వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై 'మా' పూర్తి సమాచారాన్ని సేకరిస్తోందని, తగిన ఆధారాలతో చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని స్పష్టం చేశారు.డీప్‌ఫేక్‌లు, సైబర్‌బుల్లీయింగ్, సినిమాలపై ఉద్దేశపూర్వకంగా చేసే నెగెటివ్ ప్రచారాలను ఎదుర్కోవడానికి ఒక పటిష్టమైన, శాశ్వత వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని విష్ణు నొక్కిచెప్పారు. దీనికోసం తెలుగు ఫిలిం ఛాంబర్, నిర్మాతల మండలి, 'మా' ప్రతినిధులు తక్షణమే సమావేశం కావాలని ఆయన కోరారు. ఒక సినిమాపై విమర్శలు రావడం సహజమేనని, కానీ సినిమా విడుదలకు ముందే దానిని దెబ్బతీసే ఉద్దేశంతో వ్యవస్థీకృతంగా దాడి చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.

# అఖండ-3 ఉంటుంది..
## నెలాఖరులోగా గుడ్‌న్యూస్: బోయపాటి

నందమూరి బాలకృష్ణ, మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన ప్రతి సినిమా సూపర్ హిట్ అయ్యాయి. రీసెంట్‌గా వీరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమా 'అఖండ-2'. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. అయితే తాజాగా బోయపాటి శ్రీను అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పారు. 'అఖండ-3' కచ్చితంగా ఉంటుందని ఆయన అన్నారు. సోమవారం విఐపి ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వారికి వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. నెలాఖరిలోగా తన కొత్త ప్రాజెక్టును ప్రకటిస్తానని తెలిపారు.



## వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' అక్టోబరు 9న రావడంలేదు..
# కారణం ఏంటో చెప్పిన నాగవంశీ

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా విడుదల వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 9న థియేటర్లలోకి రావాల్సి ఉండగా, కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు నిర్మాత నాగవంశీ అధికారికంగా ప్రకటించారు. ఈ ఆకస్మిక పరిణామంతో వెంకటేశ్ అభిమానులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.



సినిమా వాయిదాకు గల కారణాలను నిర్మాత నాగవంశీ స్పష్టంగా వివరించారు. ఆయన మాట్లాడుతూ.. "సినిమాకు సంబంధించిన తుది దశ పనులు ఇంకా పూర్తి కాలేదు. మరో రెండు, మూడు పాటల చిత్రీకరణతో పాటు, కొన్ని కీలక సన్నివేశాల షూటింగ్ కూడా మిగిలి ఉంది. వీటికి తోడు ప్రచార కార్యక్రమాలను కూడా ప్రారంభించాల్సి ఉంది. ఈ పనులన్నీ పూర్తి చేయడానికి కనీసం రెండు నుంచి మూడు వారాల సమయం పడుతుంది.. సోషల్ మీడియాలో ఎవరూ వేలెత్తి చూపకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని తెలిపారు.నిర్ణయించిన తేదీకే విడుదల చేయాలనే తొందరలో నాణ్యతతో రాజీ పడలేమని నాగవంశీ పేర్కొన్నారు. "ప్రేక్షకులతో పాటు మేం కూడా థియేటర్‌లో సినిమా ఫైనల్ కాపీ చూడటం మాకు ఇష్టం లేదు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న కాపీనే థియేటర్లకు అందిస్తాం. సినిమా నాణ్యతకే మా మొదటి ప్రాధాన్యత. అందుకే పూర్తి సంతృప్తిగా అన్ని పనులు ముగించుకుని, కొత్త విడుదల తేదీని ప్రకటిస్తాం" అని ఆయన వివరించారు.

ప్రస్తుతం చిత్ర బృందం మిగిలి ఉన్న పనులను వేగంగా పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది. అయితే పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని అక్టోబర్ 30న విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మొత్తానికి, భారీ అంచనాలతో ఎదురుచూస్తున్న ఈ సినిమా కోసం అభిమానులు మరికొంత కాలం వేచి చూడక తప్పదు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613